12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 34 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల గురువారం 8 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 34 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA THU 8 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## పాతికేళ్ల ప్రజా ప్రస్థానం.. ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం



- 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని కొనియాడిన రాష్ట్ర మంత్రివర్గం
- భారత్ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై పెంచారని ప్రశంస
- దూరదృష్టి, సమర్థ పాలనతో దేశానికి దిశానిర్దేశం చేస్తున్నారని కితాబు
- దేశసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

- మిగతా 2లో

## ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం

- కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాలకు భూసేకరణ పూర్తయిందన్న రామ్మోహన్ నాయుడు
- భోగాపురం ఎయిర్‌పోర్టుతో పారిశ్రామికంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ధీమా
- విశాఖ ఎకనామిక్ రీజియన్ త్వరలోనే వాస్తవరూపం దాల్చుతుందన్న కేంద్ర మంత్రి



పెన్ పవర్ డెస్క్:ఏపీలో కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం, కుప్పం, నాగార్జున సాగర్ సమీపంలో, అమరావతి వంటి ప్రాంతాల్లో ఈ నూతన విమానాశ్రయాలు రానున్నాయని చెప్పారు. ఇప్పటికే శ్రీకాకుళం,

- మిగతా 2లో

## ఢిల్లీలో సీఎం చంద్రబాబు.. నిర్మలా సీతారామన్‌తో భేటీ,

# రాష్ట్ర ప్రాజెక్టులపై చర్చ

- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుపై ప్రధానంగా చర్చ
- రెండు రోజుల పర్యటనలో ప్రధాని, పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం
- విశాఖ మెట్రో, పోలవరం, పుష్కరాల నిధులపై విజ్ఞప్తి చేసే అవకాశం
- నేడు సీఐఐ సదస్సులో పాల్గొననున్న ముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే విషయంలో జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై కేంద్రమంత్రికి వివరించారు. జీహెచ్ హెచ్ ప్రారంభోత్సవానికి వచ్చి ఆ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కేంద్రమంత్రికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర వాటాలకు సంబంధించిన అంశంపైనా వారు చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్'కు రావాలంటూ నిర్మలను చంద్రబాబు ఆహ్వానించారు.

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబుకు టీడీపీ ఎంపీలు, నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ పర్యటనలో భాగంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు అనుమతులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రత్యేక నిధులు, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్ర సహకారం వంటి అంశాలపై చంద్రబాబు విజ్ఞప్తి చేయనున్నారు. వీటితో పాటు గోదావరి వరద జలాల సద్వినియోగం, నదుల అనుసంధానంపై కూడా చర్చించనున్నారు.

(అక్టోబర్ 8) మధ్యాహ్నం ఢిల్లీలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్‌లో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. పర్యటన ముగించుకుని నేడు రాత్రికి ఆయన తిరిగి అమరావతికి రానున్నారు. ఇదే సందర్భంగా, ప్రధాని మోదీ 25 ఏళ్లుగా నిరంతరాయంగా కార్యనిర్వాహక పదవుల్లో కొనసాగుతున్నందుకు చంద్రబాబు ఆయన నాయకత్వ పటిమను ప్రశంసించారు. స్పష్టమైన దార్శనికత, నిజాయతీ, క్రమశిక్షణే ఆయన విజయానికి కారణమని పేర్కొన్నారు.



# రణరంగంగా మారిన ఢిల్లీ..

# రాహుల్, ప్రియాంక అరెస్ట్..

## బలవంతంగా వాహనంలోకి ఎక్కించిన పోలీసులు

పెన్ పవర్ డెస్క్: జంతర్ మంతర్ వద్ద లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని, ప్రియాంకా వాద్రాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , 'ఓట్ చోరీ' ఆరోపణలపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ INDIA కూటమి ఎంపీలు అక్టోబర్ 7న బుధవారం జంతర్ మంతర్ వద్ద నిరసనకు దిగారు.అయితే నిరసనకు అనుమతి లేదంటూ పోలీసులు రాహుల్ ను, విపక్ష ఎంపీలను అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీసులకు ,కాంగ్రెస్ నేతలకు వాగ్వాదం, తోపులాట జరిగింది. తమపై పోలీసులు దాడి చేశారని,

- మిగతా 2లో



## డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

- ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కార్యాచరణ
- 'ఆపరేషన్ చైతన్యం', 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల విస్తరణకు ఆదేశం
- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్
- అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం, సరిహద్దుల్లో నిఘా పటిష్ఠం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు,

- మిగతా 2లో

## ఏపీలో మరో 58 వేల మందికి

# 'తల్లికి వందనం'..

## క్యాబినెట్ నిర్ణయం

- 'తల్లికి వందనం' పథకం విస్తరణకు కేబినెట్ ఆమోదం
- కొత్తగా 58,601 మంది విద్యార్థులకు అందనున్న ప్రయోజనం
- మొత్తం లబ్ధిదారుల సంఖ్య 68 లక్షలు దాటిన వైనం
- దసరా పండుగ లోపు తల్లుల ఖాతాల్లో నగదు జమ

- మిగతా 2లో



## ఖర్గే విందుకు అఖిలేశ్ డుమ్మా..

**భవిష్యత్తులో టీ, సమోసాలు తింటూ చర్చిస్తామని వ్యాఖ్య**

పెన్ పవర్ డెస్క్:ఇండియా కూటమి ఐక్యత మరోసారి ప్రశ్నార్థకమైంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం ఏర్పాటు చేసిన విందుకు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ గైర్హాజరయ్యారు. ఈ పరిణామంపై ఆయన చేసిన వ్యాఖ్యలు

- మిగతా 2లో

## డిసెంబర్‌లో మరోసారి రెపో రేటు పెంపు ఉండొచ్చు: ఎస్‌బీఐ రీసెర్చ్

- డిసెంబర్‌లో రెపో రేటు 50 బేసిస్ పాయింట్లు పెరగొచ్చని అంచనా
- తాజాగా 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చిన ఆర్‌బీఐ
- పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ అనిశ్చితి దీనికి ప్రధాన కారణాలు
- డిసెంబర్ నాటికి రెపో రేటు 6 శాతానికి చేరొచ్చన్న ఎస్‌బీఐ రీసెర్చ్

- మిగతా 2లో

## 'రూ.30కోట్ల ఆస్తులు ప్రకటించకపోతే..

# అవినీతి అనుకోవాలా?'



పెన్ పవర్ డెస్క్: టీవీకే అధినేత, నటుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో సుమారు రూ.30 కోట్ల విలువైన ఆస్తులు వెల్లడించలేదన్న పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఆస్తుల వివరాలు వెల్లడించకపోవడాన్ని నేరుగా 'అవినీతి

- మిగతా 2లో



## రసాయన శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

- రసాయన శాస్త్రంలో 2026 సంవత్సరానికి నోబెల్ బహుమతి ప్రకటన
- ఫ్రాన్స్ శాస్త్రవేత్త హెన్రీ కగన్, జపాన్ శాస్త్రవేత్త కెన్నో సోయ్‌లకు పురస్కారం
- అణువుల అసమానత, స్వీయ ఉత్ప్రేరణపై పరిశోధనలకు ఈ గౌరవం
- ఔషధాలు, పరిమళాల తయారీలో కీలకం కానున్న ఈ ఆవిష్కరణలు

- మిగతా 2లో

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు: ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

- రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై అక్టోబర్ 15 నుంచి ఛార్జీలు
- ఈ ఛార్జీల వల్ల లావాదేవీల పరిమాణం తగ్గదని ఆర్బీఐ గవర్నర్ స్పష్టత
- ఈ రుసుముల వల్ల కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని కేంద్రం వెల్లడి
- వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ బదిలీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు



పెన్ పవర్ డెస్క్:యూపీఐ ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై స్వల్పంగా విధించనున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వల్ల లావాదేవీల పరిమాణంపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. అక్టోబర్ 15 నుంచి రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం యూజర్ ఛార్జీ అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# దేశం పరువు పోయిందిగా..

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థనే ఇబ్బందుల్లోకి నెట్టారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశంలో ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ మరియు న్యాయపరమైన వివాదం నడుస్తోంది. ఆయనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, కొంతమంది పౌర సమాజ కార్యకర్తలు ఆరోపణలు గుప్పిస్తుండగా, కోర్టులలో కూడా పిటిషన్లు దాఖలయ్యాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , సెంట్రలైజ్డ్ సాఫ్ట్‌వేర్ విధానాల వల్ల లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మిగిలిన కమిషనర్ల అభ్యంతరాలను పక్కనబెట్టారని కొందరు మాజీ బ్యూరోక్రాట్లు, కార్యకర్తలు ఆరోపిస్తూ ఆయనకు “పబ్లిక్ ఇంపీచ్‌మెంట్ నోటీస్” పంపేందుకు ప్రయత్నించారు.

### తక్షణమే పదవి నుంచి వైదొలగాలని...

జ్ఞానేశ్ కుమార్ ను సీఈసీ పదవి నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలంటూ దాఖలైన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత సంస్థ చట్టానికి లోబడే పనిచేస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలను సమీక్షించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. మరొకవైపు కేంద్ర ఎన్నికల సంఘం తమపై వస్తున్న అంతర్గత విభేదాల వార్తలను ఖండించింది. గత ఏడాది కాలంగా తీసుకున్న నిర్ణయాలన్నీ కమిషనర్లందరి సమ్మతితో ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది. అలాగే పారదర్శకతను పెంచేందుకు వీలుగా సమావేశాల అజెండాలను ముందే పంచుకోవడం, మినిట్స్ విడుదల చేయడం వంటి కొత్త మార్పులను కూడా ఈసీ ప్రకటించింది.

### పదమూడు కోట్ల ఓట్లను...

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ూ×= ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించడం, ఫారమ్-6 నిబంధనలలో మార్పులు చేయడం వంటి కీలక నిర్ణయాలను మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి లు వ్యతిరేకించినప్పటికీ, జ్ఞానేశ్ కుమార్ ఒంటెత్తు పోకడలతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దాదాపు 14 సార్లు సహచర కమిషనర్లు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ వ్యవహారం అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా ఉందంటూ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా ఇండి కూటమి నేతలు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ఒక బహుళ సభ్యుల కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం సహజమని, అంతిమ నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే జరిగాయని వివరణ ఇచ్చింది. మొత్తం మీద జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థను గబ్బు పట్టించారన్న ఆరోపణలయితే దేశ వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో విపక్షాలు సక్సెస్ అయ్యాయి. జ్ఞానేశ్ కుమార్ మీ తాత, అమ్మమ్మల ఓటర్ల కార్డు ఐడీ నెంబరు చెబుతావా? అంటూ నెట్టింట కామెంట్స్ కూడా పెడుతున్నారు.

# డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

- మొదటి పేజి తరువాయి

అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఈ సమావేశంలో తీర్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 'ఈగల్ క్లబ్'లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 'ఆపరేషన్ చైతన్యం', విద్యాసంస్థల సమీపంలో 'సేఫ్ క్యాంపస్ జోన్', యువత కోసం 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.

హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ఒడిశా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామని, డ్రోన్ల వినియోగాన్ని కూడా పెంచుతామని తెలిపారు. సమాజంలో చైతన్యం తెచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు గుర్తించామని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేశామని, విజయవాడ, రాజమండ్రి నగరాల్లోని బ్లేడ్ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 శిక్షణ పొందిన జాగిలాలను వినియోగిస్తున్నామని, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 192 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో మరో 58 వేల మందికి 'తల్లికి వందనం'.. క్యాబినెట్ నిర్ణయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం పరిధిని విస్తరిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకం కింద కొత్తగా మరో 58,601 మంది విద్యార్థులను అర్హులుగా చేర్చుతూ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పథకం ద్వారా లబ్ధి పొందే వారి సంఖ్య మరింత పెరగనుంది.

తాజా చేర్పులతో రెండో విడతలో ఆర్థిక సహాయం అందుకునే విద్యార్థుల సంఖ్య 3,29,201కి చేరుకుంటుంది. ఫలితంగా, రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద అర్హులైన మొత్తం విద్యార్థుల సంఖ్య 67,47,190 నుంచి 68,05,791కి పెరగనుంది.

రెండో విడతకు సంబంధించిన నిధులను దసరా పండుగలోపు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం ద్వారా విద్యార్థుల చదువులకు ఆర్థికంగా చేయూత అందించడమే ప్రభుత్వ ఉద్దేశం.

# 'రూ.30కోట్ల ఆస్తులు ప్రకటించకపోతే.. అవినీతి అనుకోవాలా?'

- మొదటి పేజి తరువాయి

చర్య'గా పరిగణించవచ్చా? అని న్యాయస్థానం ప్రశ్నించింది.

### ఎన్నిక రద్దు చేయొచ్చా?

విజయ్ తన అఫిడవిట్‌లో దాదాపు రూ.600 కోట్ల ఆస్తులను ప్రకటించారని, మరో రూ.30 కోట్ల ఆస్తులు వెల్లడించలేదని పిటిషనర్ ఆరోపించారు. దీనిపై విచారణ సందర్భంగా న్యాయమూర్తి.. ఒకవేళ ఆస్తుల వివరాలను చార్టర్డ్ అకౌంటెంట్ సిద్ధం చేస్తే, పొరపాటున కొన్ని ఆస్తులు మిగిలిపోతే దాని ఆధారంగా ఎన్నికను రద్దు చేయవచ్చా? అని ప్రశ్నించారు. అలాగే వెల్లడించని ఆస్తుల వివరాల వల్ల పెరంబూర్ ఓటర్ల తీర్పుపై నిజంగా ప్రభావం పడిందా? అనే అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. ఈ కేసులో విజయ్ తన ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరుతున్నారు.

# డిసెంబర్‌లో మరోసారి రెపో రేటు పెంపు ఉండొచ్చు: ఎస్‌బీఐ రీసెర్చ్

రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది. వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే. ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తుచేసింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2026 నవంబర్ నాటికి ద్రవ్యోల్బణం 6.8 శాతానికి చేరితే, రెపో రేటును 6 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

# రణరంగంగా మారిన ఢిల్లీ.. రాహుల్, ప్రియాంక అరెస్ట్..

- మొదటి పేజి తరువాయి

నిరసన ప్రదేశానికి వెళ్లకుండా అడ్డుకున్నారని 'ఇండియా కూటమి ఎంపీలు తెలిపారు. దీంతో రాహుల్ ను పోలీసులు బలవంతంగా వాహనం ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. తమను నిరసన ప్రదేశానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని, తమపై దాడి చేశారని ×చీణ×ూ కూటమి ఎంపీలు ఆరోపించారు. మరోవైపు, నిరసనకు అనుమతి తీసుకోలేదని, కేంద్ర ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో నిరసనలు, సమావేశాలపై ఆంక్షలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.

# యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు: ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కొత్త ఛార్జీల వల్ల యూపీఐ లావాదేవీలు తగ్గుతాయా అని ప్రశ్నించగా, “ప్రస్తుతానికి లావాదేవీల పరిమాణంలో ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. ఈ స్వల్ప రుసుము వల్ల వాల్యూమ్‌పై పెద్ద ప్రభావం ఉంటుందని నేను వ్యక్తిగతంగా భావించడం లేదు” అని ఆయన స్పష్టం చేశారు. ఎండీఆర్‌పై నిర్ణయం ఇప్పటికే తీసుకున్నామని, ఇది యూపీఐ వినియోగాన్ని దెబ్బతీయదని ఆయన వివరించారు. గత ఆరేళ్లుగా నిర్దిష్ట యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు లేవు. గత నెలలో కేంద్ర ప్రభుత్వం రూ. 2,000కు పైబడిన లావాదేవీలపై ఎండీఆర్‌ను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ఈ ఛార్జీలు కేవలం వ్యాపారులకే వర్తిస్తాయని, కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలోనే స్పష్టం చేశారు. ఈ రుసుము ప్రభుత్వానికి కాకుండా, పేమెంట్ సేవలు అందించే సంస్థలకు చేరుతుందని ఆమె తెలిపారు. ఈ ఛార్జీలకు సంబంధించి కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఉత్పత్తుల వంటి రంగాల్లో రూ. 2,000 దాటిన చెల్లింపులపై ప్రతి లావాదేవీకి రూ. 5 ఫ్లాట్ ఫీజు ఉంటుంది. రూ. 75,000 అంతకంటే ఎక్కువ మొత్తంలో జరిగే లావాదేవీలపై ఎండీఆర్ గరిష్ఠంగా రూ. 300గా నిర్ణయించారు. అయితే, వ్యక్తుల మధ్య (ూ2ూ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎంత మొత్తమైనప్పటికీ ఎలాంటి ఛార్జీలు ఉండవని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ సేవలు యథాతథంగా ఉచితంగానే కొనసాగుతాయి.

# రసాయన శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

రసాయన శాస్త్రంలో, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 2026 నోబెల్ బహుమతిని ఇద్దరు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. ఫ్రాన్స్‌లోని పారిస్-సడ్ విశ్వవిద్యాలయానికి చెందిన హెన్రీ బి. కగన్, జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్‌కు చెందిన కెన్సో సోయ్‌లకు ఈ గౌరవం దక్కింది. అసమాన సేంద్రియ సంశ్లేషణలో (asymmetric organic synthesis) నాన్-లీనియర్ ఎఫెక్ట్స్, స్వీయ ఉత్ప్రేరణ (ఛబశీఎఋఖశ్రీఎంఱం) వంటి కీలక ప్రక్రియలను ఆవిష్కరించినందుకు గాను వారిని ఈ పురస్కారం వరించినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. ప్రకృతిలో అనేక అణువులు, ముఖ్యంగా మన శరీరంలోని అమైనో ఆమ్లాల వంటివి రెండు ప్రతిబింబ రూపాల్లో (mirror-image forms) ఉంటాయి. అయితే, జీవరాశులు కేవలం ఒకే రూపాన్ని వినియోగించుకుంటాయి. ఈ రసాయన అసమానత లేదా 'హోమోకిరాలిటీ' ఎలా సాధ్యమవుతుందనేది శాస్త్రవేత్తలకు శతాబ్దాలుగా ఓ పెద్ద మిస్టరీ. ఈ రహస్యాన్ని ఛేదించడంలో కగన్, సోయ్ చేసిన పరిశోధనలు కీలకపాత్ర పోషించాయి. ఒక రసాయన చర్యలో ఊహించిన దానికంటే ఎక్కువ స్థాయిలో ఒకే ప్రతిబింబ రూపాన్ని ఉత్పత్తి చేయవచ్చని హెన్రీ కగన్ తన పరిశోధనల ద్వారా నిరూపించారు. మరోవైపు కెన్సో సోయ్ స్వీయ ఉత్ప్రేరణ ప్రక్రియను అభివృద్ధి చేసి ఈ రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ ప్రక్రియలో ఒక చర్య ద్వారా ఏర్పడిన ఉత్పత్తి, తనంతట తానే ఉత్ప్రేరకంగా పనిచేస్తూ అదే రకమైన అణువుల ఉత్పత్తిని వేగవంతం చేస్తుంది. దీనివల్ల అతి స్వల్ప అసమతుల్యతతో ప్రారంభమైనా, చివరికి దాదాపుగా ఒకే రూపానికి చెందిన అణువులు మాత్రమే ఏర్పడతాయి. ఈ ఆవిష్కరణలు అద్భుతమైనవని, శతాబ్దానికి పైగా ఉన్న రసాయన రహస్యాన్ని ఇది ఛేదించిందని నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే కొనియాడారు. కగన్, సోయ్‌ల పరిశోధనలు సైద్ధాంతికంగానే కాకుండా ఆచరణలో కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఔషధాల తయారీ, సువాసనలు, పరిమళాలు, ఇతర రసాయన పదార్థాల ఉత్పత్తిలో అవసరమైన చర్యలను రూపొందించడానికి వీరి ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ పురస్కారం కింద ఇద్దరు శాస్త్రవేత్తలు 12 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ల ప్రైజ్ మనీని పంచుకుంటారు. డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో జరిగే కార్యక్రమంలో వీరికి పతకాలను ప్రదానం చేస్తారు.

# ఖర్గే విందుకు అఖిలేశ్ డుమ్మా..

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. భవిష్యత్తులో ప్రతిపక్ష నేతల భేటీలు కేవలం భోజనాలకే పరిమితం కావని, టీ తాగుతూ లేదా సమోసాలు తింటూ కూడా చర్చించుకోవచ్చని ఆయన చమత్కరించారు.

జన్‌పథ్‌లోని సాగర్ రత్న హోటల్‌లో ఖర్గే ఏర్పాటు చేసిన విందుకు ఎందుకు హాజరు కాలేదని మీడియా ప్రశ్నించగా అఖిలేశ్ స్పందించారు. “ఇది ఒక్క భోజనంతో ముగిసేది కాదు. భవిష్యత్తులో టీ తాగుతూ సమావేశమయ్యామని కూడా మీరు వినొచ్చు. మేమంతా కలిసి సమోసాలు కూడా తినొచ్చు. చర్చలు కొనసాగుతూనే ఉంటాయి” అని ఆయన వ్యాఖ్యానించారు. అంతకుముందు, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇండియా కూటమి నిర్వహించిన నిరసన ప్రదర్శనలో అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు. ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న నేతల్లో ఆయన కూడా ఉన్నారు. అయితే, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు ఆకాశవాణి భవన్ వద్ద కొనసాగించిన ధర్నాలో మాత్రం ఆయన పాల్గొనకుండా లక్నోకు తిరిగి వెళ్లారు. బుధవారం నాటి విందుకు, ఆ తర్వాత జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన కార్యక్రమానికి కూడా ఆయన, ఇతర ఎస్పీ ఎంపీలు దూరంగా ఉన్నారు. విందు ఆహ్వానం ఆలస్యంగా అందడం వల్లే అఖిలేశ్ హాజరు కాలేదని సమాజ్‌వాదీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం నాటి నిరసన కార్యక్రమాల్లో చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయాలపై అసంతృప్తి కూడా ఒక కారణంగా తెలుస్తోంది. కాంగ్రెస్ నేతలు మాత్రం ఈ విషయాన్ని తేలికగా తీసుకుంటున్నారు. మంగళవారం నాటి ఘటనల తర్వాత చాలామంది ఎస్పీ ఎంపీలు ఢిల్లీ నుంచి వెళ్లిపోయారని పేర్కొన్నారు. అయితే, 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ, కాంగ్రెస్ మధ్య సమన్వయ లోపం ఉందన్న చర్చకు ఈ పరిణామం మరింత బలాన్నిచ్చింది.

# పాతికేళ్ల ప్రజా ప్రస్థానం.. ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది. తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపిస్తున్నారని మంత్రివర్గం స్పష్టం చేసింది. సృజనాత్మకతకు, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందిస్తున్నారని అభిప్రాయపడింది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేస్తూ దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపిస్తున్నారని కొనియాడింది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధాని మోదీ దేశానికి స్థిరమైన, పటిష్ఠమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని కేబినెట్ వెల్లడించింది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూనే, దేశ ప్రయోజనాలకు

అత్యంత ప్రాధాన్యమిచ్చి అంతర్జాతీయ వేదికలపై భారత్ గౌరవాన్ని ఇనుమడింపజేశారని ప్రశంసించింది. వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ దేశాలతో దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ కృషి అనిర్వచనీయమని అభిప్రాయపడింది.

ఆధునిక, సాంకేతిక, స్వయం సమృద్ధి కలిగిన నవభారత నిర్మాణానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తీర్మానం తెలిపింది. మోదీ దార్శనికత, రాజనీతిజ్ఞతతో భారత ప్రగతికి పటిష్ఠమైన పునాదులు పడ్డాయని ఏపీ మంత్రివర్గం అభిప్రాయపడింది. 21వ శతాబ్దం ప్రధాని మోదీ నాయకత్వానిదేనని, దేశసేవలో ఆయన మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని ఆకాంక్షిస్తూ కేబినెట్ తన తీర్మానంలో పేర్కొంది.

# ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం

- మొదటి పేజి తరువాయి

కుప్పం ఎయిర్‌పోర్టులకు భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో ఉత్తరాంధ్ర ప్రాంతం ఒక మినీ ఎకనామిక్ సిటీగా రూపాంతరం చెందనుందని కేంద్ర మంత్రి అన్నారు. ఈ ఎయిర్‌పోర్టు ఈ ప్రాంత అభివృద్ధికి ఒక చోదకశక్తిగా పనిచేస్తుందని, వలసలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో భారీ పారిశ్రామిక అభివృద్ధి జరగనుందని, భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'విశాఖ ఎకనామిక్ రీజియన్' కూడా త్వరలోనే వాస్తవరూపం దాల్చనుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

## ఎస్.ఆర్.శంకరన్ జీవితం - ప్రజాసేవకు ప్రతీక



**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 7 :**

ఎస్.ఆర్.శంకరన్ జీవితం ప్రజాసేవకు ప్రతీక అని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. ఎస్.ఆర్. శంకరన్ వర్ధంతిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్.ఆర్. శంకరన్ చిత్ర పటానికి జాయింట్ కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనా సామర్థ్యంతో విశిష్ట సేవలు అందించిన వ్యక్తి శంకరన్ అన్నారు. పేదలు, దళితులు, గిరిజనులు, కార్మికులు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. పరిపాలన అంటే ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమేనని శంకరన్ విశ్వసించారని అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, విద్య, వసతి గృహాలు, సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత కల్పించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ట్రైబల్ సబ్–ప్లాన్, స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ వంటి కార్యక్రమాల అమలుకు కృషి చేశారని అన్నారు. వెట్టి చాకిరి కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. నిజాయితీ, నిరాడంబరత, మానవతా దృక్పథం, సామాజిక న్యాయం, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, కార్యాలయ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## కూటమితోనే అభివృద్ధి సాధ్యం - ఎమ్మెల్యే డా. బూర్లరామాంజనేయులు





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 07,**

నగర పాలక సంస్థ పరిధిలోని,41 వ డివిజన్ రామాంజనేయ కాలనీ నందు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న వెట్ మిక్స్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు .లి

అనంతరం తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే రామాంజనేయులు

ఈ సందర్భంగా శాసనసభ్యులు వారు మాట్లాడుతూ 41 వ డివిజన్లో రూ.20 కోట్లకు పైగా అనేక అభివృద్ధి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, ఇందులో భాగంగా రూ.50 లక్షల వ్యయంతో ఈరోజు రామాంజనేయ కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని, గతంలో ఈ కాలనీని పట్టించుకునే వారే లేరని, తొందరలోనే ఇంటి పట్టాలను కూడా అందించడం జరుగుతుందని, రామాంజనేయ కాలనీ ని రూపురేఖలు మార్చటానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు రాష్ట్ర రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు , గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు , డివిజన్ పార్టీ అధ్యక్షులు బుర్రి సురేష్ పంచుమర్తి శేషు , కూటమి శ్రేణులు, అభిమానులు కార్యకర్తలు, మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎంతమంది వచ్చినా ఎక్కడా ఇబ్బంది లేకుండా సౌకర్యాలుఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 07,**

విజయవాడకు ప్రత్యేకమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలతో పాటు సరస్ అజీవిక మేళా, విజయవాడ ఉత్సవ్--2.0 కూడా ఒకేసమయంలో జరగనున్న నేపథ్యంలో సమన్వయ శాఖల అధికారులు పటిష్ట సమన్వయంతో పనిచేయాలని.. ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలక భాగస్వాములు కావాలని ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

బుధవారం కలెక్టరేట్ శ్రీ పివిఎస్ రెడ్డి హాల్లో ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అధికారులతో సమావేశ మయ్యారు. ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు. ఈసారి వివిధ రాష్ట్రాల నుంచి కూడా ప్రముఖులు హాజరుకానున్నారని.. అదే సమయంలో సామాన్య భక్తులు, సందర్శకులకు పెద్దపీట వేస్తూ చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించారు. ఇంకా ఏవైనా పనులు మిగిలియుంటే యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. దసరా ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను ముందస్తు ప్రణాళికలకు అనుగుణంగా నిర్వర్తించాలని సూచించారు. భక్తులకు సంతృప్తికరమైన దర్శన అనుభవం కల్పించడంతో పాటు వారికి నగర పర్యటన ప్రత్యేక ఉత్సవాల ద్వారా మధురానుభూతులను మిగిల్చేలా చూడాలన్నారు. సరస్ మేళాలో దేశం నలుమూలల నుంచి స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులతో దాదాపు 650 స్టాళ్లను ఏర్పాటు



చేయడం జరుగుతోందని.. అదే విధంగా వినూత్న కార్యక్రమాలతో విజయవాడ ఉత్సవ్ వేదిక కానుందన్నారు. ప్రముఖుల పర్యటనలు, వేదికల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పోటీలు, ఫుడ్ ఫెస్టివల్స్, క్రీడాపోటీలు తదితరాలపైనా సమావేశంలో చర్చించి.. ప్రజల భాగస్వామ్యంతో ఉత్సవాల నిర్వహణను విజయవంతం చేయడంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సమావేశంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏఎన్వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు వాస్తవంగా చూపిన విస్తీర్ణం మేరకు భూ సమీకరణ జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ




**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 7 :**

రైతులు వాస్తవంగా చూపిన విస్తీర్ణం మేరకు మాత్రమే భూ సమీకరణలో భూములు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. అమరావతి రెండో విడత భూ సమీకరణలో భాగంగా తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామంలో భూసమీకరణపై బుధవారం జరిగిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే, పట్టాదారు పాసు పుస్తకం ఆధారంగా వాస్తవంగా ఉన్న భూమిని భూ సమీకరణలో తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. స్పష్టమైన హద్దులను పత్రాలు ఆధారంగా చూపించాలని కోరారు. భూ సమీకరణకు భూమిని ఇచ్చే రైతులు ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్, భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, లింక్ డాక్యుమెంట్ పత్రాలు, ఆధార్ లింక్ చేసిన ఫోన్ నెంబర్, రెండు ఫోటోలు సమర్పించాలని కోరారు. డొంక రోడ్లు, ప్రభుత్వ భూమి కలిసిన భూములు ఉంటే వాటి వాస్తవ విస్తీర్ణం మేరకు మాత్రమే తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వ భూమి కలిపి తీసుకోవడం జరగదని స్పష్టం చేశారు. రైతులు మాట్లాడుతూ తమ వద్ద దీర్ఘకాలం నుండి ఉన్న భూమి పత్రాలలో




కొలతలు, రీ సర్వేలో వస్తున్న పత్రాలలో కొలతలు తేడాలు వస్తున్నాయని వివరించారు. కొన్ని భూములకు చెరువు పడకగా చూపిస్తున్నాయని వాటిని సరి చేయాలని సూచించారు.

ఈ గ్రామ సభలో సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, తహసిల్దార్ హరిబాబు, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులను వేధిస్తే కఠిన చర్యలు మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు హెచ్చరిక

- -పోలీసులకు ఫిర్యాదు - క్రిమినల్ కేసులు
- -జీతం పడగానే మొత్తం డబ్బు డ్రా చేస్తున్న వైనం,
- -వెంటనే కార్డులు వెనక్కి ఇచ్చేయాలి



**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 07:**

మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు మున్సిపల్ శానిటరీ కార్మికులను దోచుకుంటున్న వడ్డీ వ్యాపారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని కొందరు వడ్డీ వ్యాపారులు, మున్సిపల్ కార్మికుల వద్ద నుండి ఏటీఎం కార్డులు, రేషన్ కార్డులు, బ్యాంక్ పాస్ పుస్తకాలు మరియు పాన్ కార్డులను తమ వద్ద అట్టిపెట్టుకుని అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నారని ఆయన తెలిపారు. కార్మికుల ఖాతాల్లో నెలవారీ జీతం పడిన వెంటనే, వడ్డీ వ్యాపారులు ఏటీఎం కార్డుల ద్వారా మొత్తం డబ్బును డ్రా చేసుకుంటున్నారని, దీనివల్ల కార్మికులు కనీసం ఇంటికి కావాల్సిన నిత్యావసర సరుకులు కూడా కొనుక్కోలేని దయనీయ పరిస్థితికి నెట్టబడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గమైన చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, కార్మికుల కార్డులు తీసుకున్న వారు వెంటనే వాటిని తిరిగి ఇచ్చేయాలని ఆయన హెచ్చరించారు. అప్పు ఇచ్చిన వారు పద్ధతి ప్రకారం వసూలు చేసుకోవాలి కానీ, ఇలా ఏటీఎంలు, పాస్ బుక్ లు లాక్కోవడం నేరమని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే పోలీసులకు సమాచారం అందించామని, కార్డులు తిరిగి ఇవ్వని వడ్డీ వ్యాపారులపై క్రిమినల్ కేసులు ఫైల్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

## పెడనలో పారిశుద్ధ్య వాహనాలు ప్రారంభం



**పెడన, పెన్ పవర్ అక్టోబర్ 7**

పట్టణంలోపారిశుద్ధ్యనిర్వహణను మరింత మెరుగుపర్చేందుకు రూ.12.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 19 తోపుడు బండ్లు, ట్రాక్టర్ ట్రక్కును పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగాఎమ్మెల్యేమాట్లాడుతూ.. పట్టణంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణలో మున్సిపల్ సిబ్బంది మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సంబంధిత ఇన్చార్జీలు, ప్రజలు పాల్గొన్నారు.

## వికసిత భారత్ నిర్మాణమే మనందరి లక్ష్యం: ఉప్పలపాటి శ్రీనివాసరాజు



**గుంటూరు: పెన్ పవర్, అక్టోబర్, 07,**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో సేవా జ్యోతి యాత్ర నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయితీ ప్రదీప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయ ఇన్చార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ముఖ్య అతిథులుగా హాజరై యాత్రను ప్రారంభించారు.యాత్రకు ముందు అరండల్పేటలోని యోగి భవన్లో ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని కార్యకర్తలు ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. అనంతరం వికసిత భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. యోగి భవన్ నుంచి ప్రారంభమైన సేవా జ్యోతి యాత్ర అరండల్పేట మూడో లైన్, లైబ్రరీ మీదుగా పదో లైన్, లాడ్జి సెంటర్లోని వాజ్పేయి సర్కిల్ వరకు కొనసాగింది.ఈ సందర్భంగా ఉప్పలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు నరేంద్ర మోదీ ప్రజాసేవను జీవిత ధ్యేయంగా భావించి పనిచేస్తున్నారని అన్నారు. మోదీ 25 ఏళ్ల ప్రజా సేవకు దేశ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, సేవా కార్యకర్తలు అందించిన విశ్వాసం, సహకారమే ప్రధాన బలమని పేర్కొన్నారు.ప్రతి కార్యకర్త సేవా భావంతో దేశం కోసం పనిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారని తెలిపారు. పేదలు, యువత, మహిళలు, రైతులు, కార్మికులు సహా అన్ని వర్గాల సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు.జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ.. 2047 నాటికి భారత్ను వికసిత్ భారత్గా తీర్చిదిద్దడం, ప్రపంచంలోని అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో భారత్ను నిలపడం, ఆత్మనిర్భర్ భారత్ను నిర్మించడం వంటి లక్ష్యాల సాధనలో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలని అన్నారు.దేశం కోసం అందరం కలిసి పనిచేస్తే అసాధ్యమంటూ ఏదీ లేదని, వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సేవా జ్యోతి ప్రతి కార్యకర్తలోని సేవా భావం, దేశభక్తి, సమాజం పట్ల బాధ్యతను వెలిగించే సంకల్ప జ్యోతికి ప్రతీక అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్ర శివన్నారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, నెల్లూరు జిల్లా ఇన్చార్జి భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలపాటి రవికుమార్, జాతీయ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కొత్తూరు వెంకట సుబ్బారావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, సేవా సంకల్ప కన్వీనర్ బజరంగ్ రామకృష్ణ, ఈదర శ్రీనివాస్ రెడ్డి, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే యువమోర్చా నాయకులు ప్రసాద్, యశ్వంత్, రాజా, సాయి, మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఫైరోజ్ ఖాన్, వై.వి. సుబ్బారావు, నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చరక కుమార్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు మంత్రి సుగుణ, మేరి సరోజిని, సాధు రామకృష్ణ, కటారి వాసుదేవ నాయుడు, పలువురు జిల్లా కార్యదర్శులు, మోర్చా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేవాజ్యోతి యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి






**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 07,**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 'సేవాజ్యోతి యాత్ర' బైక్ ర్యాలీని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ౘ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు శ్రీమతి గళ్ళా మాధవి బుధవారం ఘనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను గుర్తు చేస్తూ చేపట్టిన కార్యక్రమం తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బైక్ ర్యాలీని శ్రీనివాసరావుపేటలోని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గళ్ళా మాధవి సేవాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం యువతతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.టీడీపీ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన వీధుల గుండా లక్ష్మీపురంలోని మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్పేయి విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి మద్దతు తెలుపుతూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. దేశాభివృద్ధి, సుపరిపాలన, సేవా తత్వానికి ప్రతీకగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, దేశాన్ని అభివృద్ధి చెందిన భారతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, ఎన్డీయే కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన పోరాట ఫలితమే... కోట మాల్యాద్రి..

**గుంటూరు: పెన్ పవర్, అక్టోబర్, 07,**



అగ్రిగోల్డ్ బాధితుల ఒరిజినల్ బాండ్లు, ధ్రువపత్రాల పరిశీలనకు ప్రభుత్వం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గత 15 సంవత్సరాలుగా సాగించిన నిరంతర పోరాటాల ఫలితమేనని సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోట మాల్యాద్రి అన్నారు. బుధవారం గుంటూరు సిపిఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.
బాధితులకు సత్వర న్యాయం అందించాలన్న డిమాండ్‌తో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆందోళనలు, పోరాటాలు నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖరరావు అసోసియేషన్ నాయకత్వంలో సాగించిన నిరంతర పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం ప్రస్తుతం బాండ్లు, ధ్రువపత్రాల పరిశీలనకు చర్యలు
చేపట్టిందన్నారు.ఈ నెల 8వ తేదీ నుంచి గుంటూరు ఎస్పీ కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితుల బాండ్లు, ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. బాధితులు ఒరిజినల్ బాండ్లు, ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, గుర్తింపు కార్డు జిరాక్స్, తాజా పాస్‌పోర్టు సైజు ఫొటోలు తదితర పత్రాలతో హాజరు కావాలని సూచించారు.అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారం కోసం సీపీఐ, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి నుంచి బాధితుల పక్షాన నిలిచి పోరాడుతున్నాయని మాల్యాద్రి తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన బాండ్ల పరిశీలన ప్రక్రియతో బాధితులకు న్యాయం జరిగే దిశగా మరో ముందడుగు పడిందన్నారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు అసోసియేషన్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## పేటలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల పటిష్ట చర్యలు



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, అక్టోబర్ 07**

పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో చిలకలూరిపేట రూరల్ పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సుబ్బనాయుడు, ఎస్ఐ జి. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మద్దిరాల గ్రామ పరిధిలోని నవోదయ పాఠశాల సమీపంలో మరియు లింగంగుంట్ల జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకై రేడియం స్టిక్కర్లతో కూడిన డ్రమ్ములు, టైర్లను జిగ్‌జాగ్ పద్ధతిలో ఏర్పాటు చేసి వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పిస్తూ.. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కారు తదితర ఫోర్ వీలర్ వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని వారు కోరారు.

## శీలం ఆదిశేషు కుటుంబానికి P4 దాతల సాయం

**చల్లపల్లి పెన్ పవర్ అక్టోబర్ 7**



మోపిదేవి మండలం మెరకనపల్లి శీలం వారి గూడెం గ్రామస్తుడు ఎన్టీఆర్ అభిమాని ఇటీవల ప్రమాదవశాత్తు పులి గడ్డ కాలవలో పడిమృతి చెందిన శీలం ఆదిశేషు కుటుంబానికి స్వర్ణ మెరకనపల్లి గ్రామస్తులు 11000 రూపాయలు సాయం అందజేశారు. గ్రామంలో ఆపదలో ఉన్నవారికి తమ వంతు సాయం చేస్తామని ా4 దాతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్ పర్సన్ యర్రంశెట్టి సుబ్బారావు, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు యర్రంశెట్టి సునీల్, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు మెరకనపల్లి సుబ్బారావు, సోమిశెట్టి వెంకటరమణ, ఆకుల పవన్ కళ్యాణ్, కర్రా వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి పూర్ణచంద్రరావు, యడ్లపల్లి కార్తీక్, ఆకుల అంజయ్య, ఆకుల శ్రీనివాసరావు, గంగిశెట్టి రాజేంద్రప్రసాద్,ఆకులసుధాకర్,ముత్యాలపోతురాజు,విశ్వేశ్వరరావు, కైతేపల్లి వెంకయ్య, శీలం రామకృష్ణ, డేవిడ్ అంకినీడు తదితరులు పాల్గొన్నారు.

## 65 లక్షలతో నూతన రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్..

## మంతెన, తెన్నేరు, జగన్నాధపురం రోడ్ల అభివృద్ధి,



**పెన్ పవర్,కృష్ణాజిల్లాకంకిపాడు, అక్టోబర్ 07**

పల్లె పండుగ 3.0లో భాగంగా పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్
కంకిపాడు మండలంలోని మంతెన, తెన్నేరు, జగన్నాథపురం గ్రామాల్లో రూ.65 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు పెనమలూరు ఎమ్మెల్యే శ్రీ బోడే ప్రసాద్ శంకుస్థాపన చేశారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..
గత రెండున్నరేళ్లలో ఈ మూడు గ్రామాల అభివృద్ధికి NREGS ద్వారా సుమారు రూ.1 కోటి, మండల పరిషత్ మరియు గ్రామస్థాయి నిధుల ద్వారా మరో రూ.1.61 కోట్ల వరకు నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. తాజాగా గ్రామాల అభివృద్ధి కోసం మరో రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు.నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.
ప్రస్తుతం NREGS నిధులు కొంత తగ్గిన కారణంగా అన్ని పనులకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేకపోతున్నామని, భవిష్యత్తులో మరిన్ని నిధులు సమీకరించి గ్రామాల్లో విస్తృతంగా అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు.
ప్రతి గ్రామంలో మెరుగైన రహదారులు, మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బ్రతికున్న భర్తను చనిపోయినట్లు నమ్మించి నకిలీ డెత్ సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వ పింఛన్ పొందేందుకు యత్నం: ఇద్దరు నిందితుల అరెస్ట్, రిమాండ్

**పెన్ పవర్,కృష్ణాజిల్లాపెనమలూరు, అక్టోబర్ 07**



ప్రభుత్వ పింఛన్ పొందాలనే దురుద్దేశంతో బ్రతికున్న తన భర్త చనిపోయాడని నకిలీ పత్రాలు సృష్టించి డెత్ సర్టిఫికెట్ పొందిన మహిళతో పాటు, లంచం తీసుకుని నకిలీ శ్మశానవాటిక ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ ఇన్ స్పెక్టర్ ను పెనమలూరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.
పోలీసుల కథనం ప్రకారం...కానూరు గ్రామ పంచాయతీ ఆఫీస్ రోడ్డులో నివాసముంటున్న యర్రంశెట్టి రమాదేవి (A1) తన భర్త మురళీకృష్ణతో విభేదాల కారణంగా గత 15 ఏళ్లుగా విడిగా ఉంటోంది. ఇటీవల ప్రభుత్వం కొత్త పింఛన్లకు దరఖాస్తులు కోరడంతో, పింఛన్ పొందేందుకు భర్త చనిపోయినట్లు నకిలీ సర్టిఫికెట్‌పొందాలనిపథకంవేసింది.ఇందులోభాగంగావిజయవాడ లోని గుణదల సెక్టార్ 3 లో శానిటరీ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న ఆంటోనీ (ఏ2)ని సంప్రదించింది. రూ.15,000 లంచం తీసుకుని, ప్రభుత్వ రికార్డులను టింకరింగ్ చేసి మురళీకృష్ణ చనిపోయినట్లు నకిలీ బరియల్/క్రిమేషన్‌సర్టిఫికెట్(No.62294) జారీ చేశారు. దీనిఆధారంగాతాడిగడపమున్సిపాలిటీలోదరఖాస్తుచేసి,అధికారులను నమ్మించి 15.08.2026న డెత్ సర్టిఫికెట్ పొందింది.అయితే భర్త మురళీకృష్ణ సజీవంగా ఉన్నాడనే వార్త పత్రికల్లో రావడంతో తాడిగడప మున్సిపల్ కమిషనర్ విచారణ జరిపి పెనమలూరు పి.ఎస్ నందు ఫిర్యాదు చేశారు.
మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పెనమలూరు పోలీసులు నిందితులైన A1-యర్రంశెట్టి రమాదేవి,మరియు నేరానికి సహకరించిన A2-దారా ఆంటోనీలను అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు.

## తెలుగు సాహిత్యం విలువ వెలకట్టలేనిది తేజస్వి పొడపాటి

**అమరావతి, పెన్ పవర్,అక్టోబరు 7:**






తెలుగు భాష, సాహిత్యం విలువ వెలకట్టలేనిదని, మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దే శక్తి తెలుగు సాహిత్యానికి ఉందని ఏపీ సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి అన్నారు.ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బుధవారం అమరావతి సాహిత్య ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి తేజస్వి పొడపాటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ సాహిత్య ఉత్సవాల వీడియోను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తేజస్వి పొడపాటి మాట్లాడుతూ డిజిటల్ యుగంలో నేటితరం అక్షరం విలువను విస్మరిస్తోందని అన్నారు. సాహిత్య మాధుర్యాన్ని ఆస్వాదించాలంటే అక్షరాన్ని ఆరాధించాలని సూచించారు. విదేశీ భాషలపై ఆసక్తి పెంచుకుంటున్న విద్యార్థులు మాతృభాషను మాత్రం విస్మరించకూడదని తెలిపారు. తెలుగు భాష, సాహిత్యాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రాచుర్యంలోకి తీసుకెళ్లేందుకు సంస్కృతి కమిషన్ కృషి చేస్తోందన్నారు.
విజయవాడలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు సాహిత్య, సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తేజస్వి పొడపాటి తెలిపారు.
పుస్తక పఠనంతో ఆత్మవిశ్వాసం
జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు సంభాషణా నైపుణ్యాలు మెరుగుపడతాయని అన్నారు. అమరావతి గొప్పదనాన్ని విశ్వవ్యాప్తం చేసేలా సాహిత్య ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమనినిర్వాహకులనుప్రశంసించారు.కవులు, రచయితలను ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంయూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల భాషలు, సాహిత్యాలను పరిమళింపజేస్తున్న కవులు, రచయితలను ఒకే వేదికపైకి తీసుకురావడమే అమరావతి సాహిత్య ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రెండు ప్రతిష్ఠాత్మక సాహిత్య పురస్కారాలను అందించనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి మినీ కృష్ణన్, డీన్ డాక్టర్ విష్ణుపథ్, ఉత్సవాల కన్వీనర్లు డాక్టర్ అర్ఘాబసు, డాక్టర్ శయంతన్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.
తరలివచ్చిన కవులు, రచయితలు
మూడు రోజుల పాటు జరిగే అమరావతి సాహిత్య ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి 50 మందికి పైగా కవులు, రచయితలు, సాహిత్యాభిలాషులు హాజరయ్యారు. ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలు సాహిత్యాభిమానులను ఆకట్టుకున్నాయి. వివిధ భాషల్లోని పుస్తకాలను సందర్శకులు ఆసక్తిగా పరిశీలించారు.

## గోడౌన్లలో పిల్లలతో పని చేయిస్తే కఠిన చర్యలు ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు: పెన్ పవర్, అక్టోబర్, 07,**





గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని కామాక్షి నగర్ మిర్చియార్డుపరిసర ప్రాంతాల్లో బాల కార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మిర్చి గోడౌన్లు, పాకల్లో బాల కార్మికులు కనిపిస్తే యజమానులు, మేస్త్రీలు, తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలుతప్పవని హెచ్చరించారు. 25వ డివిజన్ కామాక్షి నగర్‌లో మిర్చి తొడిమల గోడౌన్లలో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు, మేస్త్రీలు, గోడౌన్ యజమానులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను పనులకు వినియోగించడం శిక్షార్హమైన నేరమని, పిల్లలను పనులకు తీసుకురాకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారిని చదువుల వైపు మళ్లించాలని కోరారు.ఏడాది పాటు ప్రత్యేక పర్యవేక్షణ కామాక్షి నగర్ మిర్చియార్డు ప్రాంతంలో ఏడాది పాటు బాల కార్మికుల నిర్మూలనపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బాలలను పనులకు పంపించే తల్లిదండ్రులు, పనికి అవకాశం కల్పించే గోడౌన్ యజమానులు, మేస్త్రీలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ అంశంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.
సీజనల్ హాస్టళ్లను వినియోగించుకోవాలి
ఒడిశా నుంచి వలస వచ్చిన కార్మికుల పిల్లలు చదువులకు దూరం కాకుండా సీజనల్ హాస్టళ్లు, విద్యా సదుపాయాలను సమర్థంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన పిల్లలందరికీ వసతి, విద్యా అవకాశాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.శానిటేషన్‌పై రాజీ లేదు
మిర్చి తొడిమల వ్యర్థాలను గోడౌన్ల వెలుపల పడేయడం,వాటినికాల్చడం వల్ల శానిటేషన్ సమస్యలు, కాలుష్యం పెరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా తగిన విధంగా నిర్వహించాలని సూచించారు. శానిటేషన్ అధికారులుప్రత్యేక కార్యక్రమం చేపట్టి వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.
కార్మికులకు మరుగుదొడ్లు తప్పనిసరి
గోడౌన్లలోపనిచేసేకార్మికులకు, ముఖ్యంగా మహిళలకు తగిన మరుగుదొడ్ల సదుపాయం కల్పించడం యజమానుల బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్మికుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి గోడౌన్‌లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.
అనంతరం మీడియాతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ బాల కార్మికులు, విద్య, శానిటేషన్, శాంతిభద్రతల సమస్యల పరిష్కారానికి అధికారులు, గోడౌన్ యజమానులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలనిపిలుపునిచ్చారు. గోడౌన్ యజమానులు, మేస్త్రీల వివరాలను సేకరించామని, ఇకపై నిరంతర పర్యవేక్షణ కొనసాగు

## ప్రతి గర్భిణీ వివరాలు నమోదు చేయాలి జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 7 :**





ప్రతి గర్భిణీ వివరాలు నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిపై జాయింట్ కలెక్టర్ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. గర్భం దాల్చిన వెంటనే గర్భిణీల వివరాలు నమోదు చేయాలన్నారు. ఒక్క గర్భిణి వివరాలు కూడా తప్పిపోరాదని స్పష్టం చేశారు. గర్భిణీల పూర్తి వివరాలు నమోదు చేయడం వలన హై రిస్క్ కేసులను నివారించుటకు తోడ్పడుతుందని చెప్పారు. రక్త హీనత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పౌష్టిక ఆహారం అందడమే కాకుండా, దానిని వారు మాత్రమే తీసుకునే విధంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రసవ తేదీలను కూడా ముందుగానే గుర్తించడం వల్ల ఆసుపత్రుల్లో చేర్చవచ్చని అన్నారు. ఆసుపత్రిలోనే ప్రసవం కావడానికి ప్రేరణ కల్పించాలని సూచించారు. టీనేజ్ ప్రెగ్నెన్సీల నివారణకు చర్యలు తీసుకోవాలని, దాని వలన కలిగే అనర్థాలను తెలియజేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లల హాజరు శాతాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. పౌష్టిక ఆహారాన్ని పిల్లలకు అందించి ఆరోగ్యంగా పెరుగుటకు కృషి చేయాలని అన్నారు. నిర్ణీత సమయంలో వారి ఎత్తు, బరువును గమనించాలని, వయస్సుకు తగిన విధంగా లేనప్పుడు నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆటపాటల ద్వారా విద్యను అందించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల నుండి బయటకు వెళ్ళే చిన్నారులు ఒకటవ తరగతిలో విధిగా చేరేటట్లు శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. చిన్నారుల ఆరోగ్యం, అభ్యసన, ప్రాథమిక పాఠశాలలో చేరటం అంశాలను ట్రాక్ చేయాలని, అందుకు సమగ్రమైన రికార్డు నిర్వహించాలని సూచించారు.
అంగన్వాడీల ద్వారా మంచి సేవలు చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు అందుటకు పర్యవేక్షణ చేయాలని అన్నారు. అంగన్వాడీలలో మంచి సేవలు అందుతుందని గ్రామస్తులు ప్రశంసించే స్థాయికి తీసుకురావాలని చెప్పారు. చిన్నారుల ఆరోగ్యం భవిష్యత్తు తరాల ఆరోగ్యానికి ప్రతీక అన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.జి.ప్రసూన, సి.డి.పి.ఓలు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సెరిబ్రల్ పాల్సీపై అవగాహన తప్పనిసరిడాక్టర్ దాసరి చంద్రశేఖర్

**పర్చూరు, అక్టోబర్ 7, (పెన్ పవర్) :**



చిన్నారుల్లో వచ్చే సెరిబ్రల్ పాల్సీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఉప్పుటూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద సెరిబ్రల్ పాల్సీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సెరిబ్రల్ పాల్సీ అనేది మెదడు అభివృద్ధిలో లోపాలు లేదా మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోవడం వల్ల సంభవించే సమస్యగా వివరించారు. గర్భధారణ సమయంలో రూబెల్లా వంటి టార్చ్ ఇన్ఫెక్షన్లు, ప్రసవంలో జాప్యం, పుట్టే సమయంలో తలకు గాయాలు, తక్కువ బరువుతో జన్మించడం, అలాగే పుట్టిన తర్వాత మెదడుకు తీవ్రమైన గాయాలు, మెదడు వాపు, మెనింజైటిస్, జాండిస్ వంటి సమస్యలు కారణమయ్యే అవకాశం ఉందన్నారు.
శిశువు3నుంచి6నెలలుదాటినాతలనునిలపలేకపోవడం, బోర్లా పడటం, పాకడం, కూర్చోవడం, నడవడం వంటి అభివృద్ధి దశల్లో జాప్యం కనిపించడం, చేతులు, కాళ్లు సాధారణం కంటే గట్టిగా బిగుసుకుపోవడం లేదా పూర్తిగా వదులుగా ఉండటం, వస్తువులను పట్టుకోవడంలో ఇబ్బంది, అధికంగా చొంగ కారడం, ఆహారం మింగడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గర్భిణులు ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు, చేపలు వంటి పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని, క్రమం తప్పకుండా గైనకాలజిస్టునుసంప్రదించివారిసూచనలుపాటించాలని సూచించారు.సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతున్న చిన్నారులపైసానుభూతి చూపడం మాత్రమే కాకుండా, వారికి అవసరమైన సహకారం అందించి సమాజంలో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ చంద్రశేఖర్ కోరారు.
కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ బాలశ్యామల, ఆయా,విద్యార్థినీవిద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా సన్నద్ధం కావాలి
## అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల

**నరసరావుపేట, పెన్ పవర్ అక్టోబర్ 07:**
త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి అధికారులు సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ జగదీశ్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారులు, ఆర్డీఓలు, డీఎస్పీలు, డీఎల్‌డీఓలతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పురపాలక సంఘాల్లో వార్డు కౌన్సిలర్లు, చైర్మన్ ఎన్నికల నిర్వహణకు అధికారులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు.

**స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి**
ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం అవసరమైన ప్రాంతాల్లో పటిష్టమైన స్ట్రాంగ్ రూములను ముందుగానే గుర్తించాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ నిర్వహణకు విశాలమైన హాళ్లను ఎంపిక చేసి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. స్ట్రాంగ్ రూములకు ద్వంద్వ తాళాల విధానం అమలు చేయడంతో పాటు పటిష్టమైనభద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల పరిధిలో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కూడా పూర్తి చేయాలని తెలిపారు. కౌంటింగ్‌కు ముందు బ్యాలెట్ పత్రాలను క్రమబద్ధంగా కట్టలుగా సిద్ధం చేసే ప్రక్రియ చేపట్టాలని సూచించారు. వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్‌తదితర ఎన్నికల కౌంటింగ్ కోసం అవసరమైన మేరకు ప్రత్యేక హాళ్లను ఎంపిక చేయాలన్నారు.

**రవాణా, ఎన్నికల సామగ్రి పంపిణీపై కార్యాచరణ**
ఎన్నికల సామగ్రి రవాణాకు అవసరమైన



వాహనాలను ముందుగానే గుర్తించి సమగ్ర రవాణా ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రహదారులు, ప్రాంతాలు, మండలాలు, జోన్ల విభజన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియలను పకడ్బందీగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైన సంఖ్యలో బ్యాలెట్‌బాక్సులను ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. పంచాయతీల్లో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం బ్యాలెట్ బాక్సులను సంబంధిత ఖజానాల్లో భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రిని పోలీసు ఎస్కార్ట్, బందోబస్తు నడుమ సురక్షితంగా తరలించాలని సూచించారు.

**పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ**
పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్యను ప్రాతిపదికగా తీసుకుని తగిన సంఖ్యలో పోలింగ్ సిబ్బందిని నియమించాలని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ సిబ్బందిని కూడా ముందుగానే ఎంపిక చేసి వారికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు.
ప్రధాన శిక్షకుల ద్వారా శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి ఎన్నికల విధులపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల నిర్వహణ వ్యవస్థలో నమోదు చేయాలని తెలిపారు. ప్రతి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సాంకేతిక సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, వెబ్‌కాస్టింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, వ్యయ పర్యవేక్షణ, స్థిర నిఘా బృందాలు, రిటర్నింగ్ అధికారులు, జోనల్, రూట్ అధికారులను ముందుగానే గుర్తించి జాబితాలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వీరందరికీ ఎన్నికల వివిధ దశలపై ముందస్తుగా శిక్షణ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసుల అప్రమత్తత**
ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు.
ఎన్నికల ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశించారు.
ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సంజన, జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి, ఆర్డీఓలు, డీఎస్పీలు, డీఎల్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# పేలుడు పదార్థాలు, బాణసంచా దుకాణాలపై తనిఖీలు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ

**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 7:**
జిల్లాలోని పేలుడు పదార్థాలు, బాణసంచా హోల్‌సేల్ దుకాణాలు, గోదాముల్లో భద్రతా ప్రమాణాలపై సంయుక్త తనిఖీలు నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ బుధవారం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.మండల, పట్టణ స్థాయిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులతో బహుళ శాఖల తనిఖీ కమిటీలను ఏర్పాటు చేశారు. సంబంధిత తహసీల్దార్ సమన్వయ అధికారిగా వ్యవహరించనున్నారు.
దుకాణాల లైసెన్సుల చెల్లుబాటు, అనుమతించిన పరిమాణంలోనే బాణసంచా నిల్వ ఉందా, అనధికార నిల్వలు ఉన్నాయా, నిల్వ ప్రదేశం నిబంధనలకు అనుగుణంగా ఉందా అనే అంశాలను అధికారులు



పరిశీలించనున్నారు. భవనం నిర్మాణం, అత్యవసర మార్గాలు, విద్యుత్ భద్రత, అగ్నిమాపక పరికరాల లభ్యత, ఇతర భద్రతా ప్రమాణాలను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు.నిబంధనల ఉల్లంఘనలు, లోపాలు గుర్తిస్తే వాటిని స్పష్టంగా నమోదు చేసి, అవసరమైన చోట ఫొటోలను సంయుక్త తనిఖీ నివేదికకు జత చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
తనిఖీలు పూర్తయిన అనంతరం మూడు నుంచి ఐదు రోజుల్లోగా సంయుక్త తనిఖీ నివేదికలను గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో కమిషనర్‌కు, ఇతర ప్రాంతాల్లో సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులకు సమర్పించాలి. నివేదికల ఆధారంగా నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నారు.జాబితాలో లేని, అనధికారికంగా నిర్వహిస్తున్న లేదా కొత్తగా గుర్తించిన బాణసంచా దుకాణాలు, గోదాములు, నిల్వ ప్రాంగణాలను కూడా తనిఖీల పరిధిలోకి తీసుకుని, నిబంధనల ప్రకారం చర్యలకు నివేదించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. తనిఖీల్లో నిర్లక్ష్యం, ఆలస్యం లేదా వైఫల్యాన్ని తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.

# ఎ.ఎస్.డి.డి ఓటర్ల జాబితాపై మరోసారి ఇంటింటి పరిశీలన జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ,పెన్ పవర్,అక్టోబర్ 7:**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా అందుబాటులో లేని వారు, వేరే ప్రాంతాలకు తరలిపోయిన వారు, మరణించిన వారు, ఒకటి కంటే ఎక్కువసార్లు నమోదైన వారి వివరాలపై మరోసారి ఇంటింటి పరిశీలన చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.
జూన్ 15 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సందర్శనలు నిర్వహించగా, జిల్లాలో 1,23,714 మంది ఓటర్లు ఎ.ఎస్.డి.డి జాబితాలో ఉన్నట్లు గుర్తించామని కలెక్టర్ వెల్లడించారు. జూలై 31న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో జిల్లాలో 15,89,731 మంది ఓటర్లు నమోదై ఉన్నారని తెలిపారు.
నోటీసుల ప్రక్రియలో భాగంగా అక్టోబర్ 6 వరకు మరో 12,786 మంది అనర్హులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ వివరాలన్నింటినీ పరిశీలించి



అక్టోబర్16న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హత ఉన్న ఒక్క వ్యక్తి కూడా ఓటరుగా నమోదు కాకుండా మిగిలిపోకూడదనే ఉద్దేశంతో ఎ.ఎస్.డి.డి జాబితాపై మరోసారి ఇంటింటి పరిశీలన చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 8 నుంచి బూత్ స్థాయి అధికారులు తొలగించబడిన పేర్లపై ఇంటింటి పరిశీలన నిర్వహిస్తారని వెల్లడించారు.పరిశీలనలో పొరపాటున ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించినట్లు తేలితే, సంబంధిత వ్యక్తి నుంచి ఫారం--6 ద్వారా వెంటనే ఓటరు నమోదుకు దరఖాస్తు స్వీకరించి, నిరంతర ఓటర్ల జాబితా నవీకరణలో భాగంగా ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.
అర్హత తేదీలుగా ప్రతి సంవత్సరం జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 తేదీలను పరిగణిస్తూ ఓటర్ల జాబితాను నిరంతరం నవీకరిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. తుది జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు తమ అర్హత పత్రాలతో ఫారం--6 ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు.

# పతకం ఒక్కటే కాదు.. పీ4 స్ఫూర్తికి ఘన విజయం ఫలించిన జిల్లా కలెక్టర్ .లక్ష్మీశ చొరవ.. కృపారావు బంగారు విజయం

**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 07,**
కెనడాలో ఇటీవల జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో జి.కొండూరు మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన క్రీడాకారుడు సంకు కృపారావు బంగారు పతకం సాధించి ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుర్తింపు తెచ్చారు. ఈ విజయం వెనుక ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం పీ4 స్ఫూర్తి పథం కూడా ఉంది. క్రీడాకారున్ని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం కలెక్టరేట్‌లో అభినందించారు. మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయి పోటీలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను ఇటీవల కృపారావు కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో కలెక్టర్ లక్ష్మీశ వెంటనే స్పందించి.. పీ4 ద్వారా సహకారం అందేలా చొరవచూపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీ4 కార్యక్రమం ద్వారా మార్గదర్శిగా ముందుకు వచ్చిన



సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను క్రీడాకారుడికి సహాయం అందించేలా అనుసంధానించి.. రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇప్పటికే వివిధ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన కృపారావు కెనడాలో ఇటీవల జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు. అంతేకాకుండా ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్‌గా నిలిచారు. ఆయన సంకల్పం సాకారం కావాలని, ఆయన విజయంతో ఎన్టీఆర్ జిల్లా పేరు అంతర్జాతీయ క్రీడా వేదికపై మార్మోగాలని కలెక్టర్ లక్ష్మీశ గతంలో ఆకాంక్షించగా అది నేడు నిజమైంది.

# భక్తుల ఆరోగ్యం, భద్రత విషయంలో భాగస్వాములుకండి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 07,**



ఇంద్రకీలాద్రి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ప్రభుత్వం అన్ని విధాలా పటిష్ట ఏర్పాట్లు చేస్తోందని.. అయితే మరోవైపు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు కూడా భక్తులకు బిస్కట్లు, ఇతర ఆహార పదార్థాలు పంపిణీ చేస్తుంటారని.. అయితే ఇలా పెద్ద మనసుతో, భక్తిభావంతో భక్తులకు ఆహార సేవ చేసేందుకు ముందుకొచ్చే వారు తొలుత కలెక్టరేట్ (91549 70454) నంబరులో సంప్రదించి, నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారమిక్కడ ఓ ప్రకటనలో కోరారు. భక్తుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను అధికారుల ధ్రువీకరణ అనంతరం నిర్వహించాలన్నారు.
స్వచ్ఛందంగా సేవలందించేందుకు ముందుకొచ్చే వారికి అధికారులు తగిన మార్గదర్శకత్వం అందించడంతో పాటు, అవసరమైన భక్తులకు ఆహార పదార్థాలు చేరేలా సమన్వయం చేసి సహాయ సహకారాలు అందిస్తారని వివరించారు. అమ్మవారి సేవలో భక్తులు నిమగ్నమై ఉంటే.. ఆ భక్తులకు సేవలందిస్తున్న అధికార యంత్రాంగానికి సహకరిస్తూ, దసరా మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు కీలక భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

# గణపవరంలో వైభవంగా స్వాములకు అన్నదానం
## ఎస్ఐ అనిల్ కుమార్, జనసేన నేత మండలనేని చరణ్ తేజలకు ఘన సత్కారం

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, అక్టోబర్ 07 :**
నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో సుమారు 450 మంది మాలధారణ చేసిన స్వాములకు మహా అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ అనిల్ కుమార్, జనసేన పార్టీ యువ నాయకులు మండలనేని చరణ్ తేజ హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎస్ఐ అనిల్ కుమార్ స్వయంగాతన చేతుల మీదుగా స్వాములకు అన్నప్రసాద వితరణ చేసి భక్తిభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గుడి నిర్వాహకులు ఎస్ఐ అనిల్ కుమార్ మరియు జనసేన యువ నేత మండలనేని చరణ్ తేజలను శాలువాలతో ఘనంగా సత్కరించి



ప్రత్యేకంగా గౌరవించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 14 మందికి జరిమానా




**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 07 :**
పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 14 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. నిబంధనలను ఉల్లంఘించి పబ్లిక్ ప్లేసుల్లో మద్యం తాగుతున్న వీరిని చిలకలూరిపేట పట్టణ పోలీసులు పట్టుకొని స్థానిక కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ మహబూబ్ సుభాని.. నిందితులకు ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున మొత్తం 14 మందికి కలిపి రూ. 14,000 జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# చిన్నారుల హక్కులకు రక్షణ, భవిష్యత్తుకు భరోసా రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ వెంకట పద్మలత జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 07,**
బాలలహక్కులనుపరిరక్షిస్తూవారికిసురక్షితమైన,ఆరోగ్యకరమైన,ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ ఎన్టీఆర్ జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలత, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు,రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కె.జి.వెంకట పద్మలత బుధవారం విజయవాడలో పర్యటించారు. పలువిద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. నలంద విద్యానికేతన్ సిబ్బందితో మాట్లాడి ప్రతి తరగతిగదిలో చైల్డ్ హెల్ప్ లైన్‌నంబరు,సలహాలపెట్టెఏర్పాటుచేయాలనిసూచించారు.అనంతర ంవిద్యార్థులతోముచ్చటించారు. తరువాత ప్రజాశక్తినగర్‌లోని అంగన్వాడీ కేంద్రాన్ని, సీవీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో బాలల భిక్షాటనను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం బాలల కోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయాలని, గ్రామ, వార్డు స్థాయిలో బాల్య వివాహాల పర్యవేక్షణ కమిటీలను మరింత బలోపేతం చేయాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, సంక్షేమానికి జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని సదుపాయాలు, సహకారం అందిస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ తీర్థం పుచ్చుకున్న మాజీ కౌన్సిలర్లు

**చీరాల, అక్టోబరు 7, (పెన్ పవర్) :**
చీరాల మున్సిపాలిటీకి చెందిన మాజీ కౌన్సిలర్లు చిలుకోటి శ్రీనివాసరావు, కాటా ప్రసాద్ తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం చీరాలలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ సమక్షంలో వారు పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మద్దులూరి మహేంద్రనాథ్ వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎస్బీఐ ద్వారా కోటి 14 లక్షల రూపాయల అందజేసిన పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా
## కలెక్టర్ చేతుల మీదుగా అన్నపూర్ణకు చెక్




**నరసరావుపేట, పెన్ పవర్ అక్టోబర్ 07:**
పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా బుధవారం అన్నపూర్ణకు రూ.1,14,00,000/- (కోటి పద్నాలుగు లక్షల రూపాయలు) విలువైన చెక్‌ను అందజేశారు. నరసరావుపేటలోని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బీఐలోని సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా పథకం ద్వారా మంజూరైన పరిహార మొత్తాన్ని చెక్ రూపంలో అందజేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకింగ్ సేవలతో పాటు ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం అభినందనీయమని అన్నారు. సామాజిక భద్రత, ప్రమాద బీమా వంటి పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు, బ్యాంకు సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. భారీ మొత్తంలో ఆర్థిక సహాయం అందడంతో కుటుంబానికి కొంత భరోసా లభించినట్లు తెలిపారు.

## పిన్న వయసులోనే న్యాయమూర్తిగా ఎంపికై వడ్డెర కులానికి గర్వకారణంగా నిలిచిన జెరిపిటి కీర్తన




**పెన్ పవర్ అక్టోబర్ 07:**
ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నల్లమడ మండలం ముసలకంపల్లి గ్రామానికి చెందిన యువతి జెరిపిటి కీర్తన అత్యంత పిన్న వయసులోనే న్యాయమూర్తిగా (జడ్జిగా) ఎంపికై అరుదైన ఘనత సాధించారు.
కేవలం 23 ఏళ్ల ప్రాయంలోనే ఈ ప్రతిష్టాత్మకమైన జ్యుడీషియల్ పరీక్షలో ఉత్తర్ణత సాధించి, న్యాయమూర్తి పదవిని అధిష్టించి తమ వడ్డెర కులానికి దేశవ్యాప్తంగా గర్వకారణంగా నిలిచారు.
విశాఖపట్నంలోని ప్రఖ్యాత దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో ఈమె తన అభ్యసనాన్ని, న్యాయవిద్యను (లా డిగ్రీ) విజయవంతంగా పూర్తి చేశారు.
చిన్న వయసులోనే కఠినమైన న్యాయమూర్తి పరీక్షలను అధిగమించి ఈ స్థాయికి చేరుకోవడం ద్వారా భవిష్యత్తు తరాల యువతకు, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల బిడ్డలకు ఈమె గొప్ప స్ఫూర్తిగా నిలిచారు. "చదువుతో లక్ష్యం – పట్టుదలతో విజయం" అనే పదాలకు నిలువెత్తు రూపంగా నిలిచిన జెరిపిటి కీర్తన సాధించిన ఈ విజయం పట్ల ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మరియు వడ్డెర సంఘం ఆధ్వర్యంలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు, కుల సంఘ నాయకులు మరియు శ్రేయోభిలాషులు ఆమెకు ఘనంగా అభినందనలు తెలియజేస్తున్నారు.

## రైతు భూమిపై దౌర్జన్యం - బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్



**పెన్ పవర్ అక్టోబర్ 07:**
నరసరావుపేట మండలం పామిడిమర్రు గ్రామానికి చెందిన రైతు కాలేం ఏడుకొండలకు కోటప్పకొండ సమీపంలోని నంది హిల్స్ వెంచర్ పక్కన ఉన్న 1.86 ఎకరాల వ్యవసాయ భూమిపై దౌర్జన్యం జరుగుతోందని ఆరోపణలు వచ్చాయి.
నంది హిల్స్ కు చెందిన రావెల్ల వెంకటేశ్వర్లు, షేక్ అనీఫ్, బ్రహ్మారెడ్డి, ఓబుల్ రెడ్డి తదితరులు భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ వ్యవసాయానికి అడ్డంకులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతు ఆరోపించారు.
రైతును, అతని కుటుంబాన్ని బెదిరించి "ఇది మా భూమి, మీరు ఇక ఇక్కడికి రావద్దు" అని హెచ్చరించడంతో పాటు పొలంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని బాధితులు వాపోయారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతు కుటుంబం ఆరోపించింది.
ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు రక్షణ కల్పించాలని, భూమిని కబ్జా చేయడానికియత్నిస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## లారీని ఢీకొట్టిన బస్సు.. తప్పిన పెను ప్రమాదం

**పెన్ పవర్ అక్టోబర్ 07:**



ఏపీలోని కర్నూలు జిల్లా కోడుమూరు సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.
సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీని ప్రైవేటు స్లీపర్ బస్సు ఢీకొట్టింది. హైదరాబాద్ నుంచి బళ్లారి వైపు బస్సు వెళ్తుండగా, ఓవర్ టేక్ చేయబోయే క్రమంలో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

## చదువు కోసం ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్న పసిచిన్నారులు – దయనీయ స్థితిలో గిరిజన విద్యార్థుల ప్రయాణం



**పెన్ పవర్ అక్టోబర్ 07:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం తామరపు లోవ ప్రాంతంలో విద్యా వ్యవస్థ దయనీయ స్థితికి అద్దం పట్టే ఘటన వెలుగు చూసింది. ?స్థానికంగా ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో, ఆ ప్రాంతంలోని పసిచిన్నారులు అక్షర జ్ఞానం కోసం ప్రతిరోజూ నానా అవస్థలు పడుతూ బడికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.
బడికి వెళ్లే క్రమంలో చిన్నారులు రోజూ రెండు కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రయాణించాల్సి వస్తోంది. అంతేకాకుండా దారి మధ్యలో ఉప్పొంగి ప్రవహిస్తున్న ఉధృతమైన వాగును దాటాల్సి వస్తున్న వైనం అందరినీ కలచివేస్తోంది. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నప్పటికీ, ప్రత్యామ్నాయ మార్గం గానీ, కనీసం వంతెన సౌకర్యం గానీ లేకపోవడంతో చిన్నారులు ప్రాణాలను పణంగా పెట్టి వాగును దాటుతున్నారు.
చిన్నారులు ప్రతిరోజూ బడికి వెళ్లివచ్చే సమయంలో ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని వారి తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ తీవ్ర ఆందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరియు ప్రజాప్రతినిధి వర్గాలు స్పందించి, తామరపు లోవ ప్రాంతంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని లేదా వాగుపై వెంటనే వంతెనను నిర్మించి గిరిజన విద్యార్థుల ప్రాణాలకు భద్రత కల్పించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

## చెత్త బుట్టలో శిశువు మృతదేహం లభ్యం

**పెన్ పవర్ అక్టోబర్ 07:**
నంద్యాల జిల్లా:
ఆళ్లగడ్డ పట్టణంలో తీవ్ర దిగ్భ్రాంతికరమైన, మానవత్వాన్ని మంటగలిపే ఘటన వెలుగు చూసింది. పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ అయిన ప్రజ్ఞా కాలేజ్ సమీప ప్రాంతంలో దారుణం చోటుచేసుకుంది. అక్కడ రోడ్డు పక్కన ఉన్న చెత్త బుట్టలో ఒక నవజాత శిశువు మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది.
పూర్తి వివరాల్లోకి వెళితే... చెత్తబుట్టలో పడి ఉన్న ఆ పసికందు మృతదేహాన్ని అటుగా సంచరించే వీధి కుక్కలు గుర్తించి, తినేందుకు ప్రయత్నించాయి. ఆ సమయంలో ఆ మార్గంలో విధుల్లో భాగంగా అటుగా వెళ్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఈ దారుణ దృశ్యాన్ని కళ్లారా చూశారు. వెంటనే వారు తీవ్ర అప్రమత్తతతో వ్యవహరించి, పెద్దపెద్దగా కేకలు వేస్తూ కుక్కలను అక్కడి నుంచి తరిమికొట్టారు.
తర్వాత వారు వెంటనే స్పందించి చెత్తబుట్టలో ఉన్న ఆ పసికందు మృతదేహాన్ని సురక్షితంగా బయటకు వెలికితీశారు.
ఈ అమానుష ఘటనపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం



చేస్తున్నారు. పురుడు పోసుకున్న వెంటనే ఆ పసికందును ఇలా చెత్తబుట్టలో పడేసింది ఎవరూ అనే కోణంలో, అలాగే దీని వెనుక ఉన్న క్రూరమైన మనస్తత్వాల గురించి స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపి, చట్టపరమైన వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## చీరాలలో బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

**చీరాల, అక్టోబర్ 7, (పెన్ పవర్) :**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు బుధవారం చీరాలలో ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో అండర్--14, అండర్--17, అండర్--19 బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు జరిగాయి.
ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. క్రీడాకారుల నైపుణ్యం, ఆటతీరు, సామర్థ్యాలను పరిశీలించిన న్యాయ నిర్ణేతలు, రిఫరీలు నిష్పక్షపాతంగా ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

**క్రీడాకారులను అభినందించిన డాక్టర్ బాబురావు**

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలకు ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యులు, ప్రేమ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ ఐ. బాబురావు, డాక్టర్ రామకృష్ణ హనుమాన్ హాజరై క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవడం వల్ల



శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, పట్టుదల పెరుగుతాయని అన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ నిరంతరం సాధన కొనసాగించాలని సూచించారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ప్రతిభావంతులైన విద్యార్థులకు మంచి వేదికగా నిలుస్తాయని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమాన్ని సీనియర్ కోచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఎస్జీఎఫ్ కార్యదర్శి పి. కోటేశ్వరరావు, ఎస్ఏపీఈలు కె. శ్రీనివాసు, యు. హనుమంతరావు, సుమలత, పీఈటీలు కె. మమత, బి. ధనుంజయ్, రిటైర్డ్ పీడీ పి. వెంకట్రావు, సీనియర్ రిఫరీ టి. కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి జిల్లా,




రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. చదువుతో పాటు క్రీడలకు కూడా విద్యార్థులు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఎంపికపోటీలసందర్భంగావిద్యార్థులు ,తల్లిదండ్రులు,వ్యాయామ ఉపాధ్యాయులు, పీఈటీలు, క్రీడాభిమానులతో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియం సందడిగా మారింది.

## "కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యి అందించిన రేవంత్ రెడ్డి కి పాలన చేతకావడం లేదు".

**-ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి శనీలా పట్టుకున్నారు..కాంగ్రెస్ కు రోజులు దగ్గరపడ్డాయి..ఫోర్త్ సిటీలో అమరవీరుల కుటుంబాలకు**
**కాలనీ నిర్మించాలి..**
**-మూడేళ్లు ఆరోపణలు చేస్తూ.. 3 రూపాయల అవినీతిని కూడా రుజువు చేయలేదు..**
**కేసీఆర్ జీవితం తెరిచిన పుస్తకం..**
**రేవంత్రెడ్డి కి పాలన చేతగాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు..**
**పంటలు కాపాడేందుకు తక్షణమే నీటిని విడుదల చేయాలి..**
**మాజీ మంత్రి వర్యులు, బీ ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటి పర్తి జీవన్ రెడ్డి..**





**జగిత్యాల జిల్లా పెన్ పవర్ అక్టోబర్ 07:**
జగిత్యాల పట్టణం లోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్ లో మాజీ మంత్రివర్యులు, బీ ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా పరిషత్ తొలి ఛైర్పర్సన్ దావా వసంత సురేష్, బీ ఆర్ ఎస్ ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం లో మాట్లాడారు.రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం తో సాగు నీరు విద్యుత్ కొరత తో పంటలు తడి ఆరిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాల్సి ఉండగా రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు.కన్నెపల్లి నుండి నీటిని ఎతిపోసి ఉంటే,ఉత్తర తెలంగాణ, సాగు నీరు అందే అవకాశం ఉండేది..కేసీఆర్ కు ఎక్కడ పేరు వస్తుందోనని కుట్ర పూరితంగా నీటిని ఎత్తిపోతలేదు..సాగు నీరు అందించలేదు..
కేసీఆర్ రైతు బిడ్డగా సాగు నీటి ప్రాజెక్టులు నిర్మించారు.2014 నుండి 7700 మెగావాట్ల విద్యుత్ నుండి 19000 మెగావాట్ల కు విద్యుత్ ఉత్పతి కి పెంచారు.దేవాదుల ప్రాజెక్టులో పది పంపు సెట్లు ఉంటే ఐదు మాత్రమే వినియోగిస్తున్నారు..రోజు కు 73.56 క్యూసెక్కుల నీరు చేసే అవకాశం ఉన్న.. కేవలం 38 క్యూసెక్కుల నీరు మాత్రమే ఎత్తిపోస్టున్నారు.
బీ ఆర్ ఎస్ పార్టీ సభ్యులను సస్పెండ్ చేసి 22 ఏ పై చర్చ చేసుకున్నారు.
ఎన్నికల అఫిడవిట్ లో కేసీఆర్ పూర్తి ఆస్తులు పేర్కొన్నారు..కేసీఆర్ ఆస్తులకు అన్నింటికి లెక్కలు ఉన్నాయి..
325 సర్వే నెంబర్ 388 ఎకరాల విస్తీర్ణత ఉంది. గూగుల్ లో వెతికిన లభిస్తుంది..
సాగు విస్తీర్ణత పేరిట అధీనంలో ఉన్న వారికి నోటీస్ లు ఇచ్చి, ఇబ్బందులకు గురి చేయడం ఎందుకు..భూ భారతి అన్ని లెక్కలు మీ దగ్గరే ఉన్నాయి కదా..
కక్ష్య పూరితంగా కెసిఆర్ నోటీసులు ఇస్తామంటున్నారు అని విమర్శించారు.
2009 ఎన్నికల అఫిడవిట్ లో ఆస్తులు పేర్కొన్నారు..
రేవంత్ రెడ్డి నోరు మూతపడ్డది..
ఆస్తుల్లో అవకతవకలు ఉంటే ఎందుకు చర్చకు పెట్టడం లేదు..
కేసీఆర్ ఉద్యమ నాయకత్వంలో అమరవీరుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డది..
ఎర్రవల్లిలో కాదు.. హైదరాబాద్ ఫోర్త్ సిటీ లో అమరవీరుల కుటుంబాలకు కాలనీ నిర్మించాలి..
రేవంత్ రెడ్డి ఏనాడు తెలంగాణ జెండా పట్టినోడు కాదు ..జైలు కెళ్ళినోడు కాదు.. మొదటి నుండి చంద్ర బాబు సంకలోనే ఉన్నాడు.
కేసీఆర్, కేటీఆర్ పై రేవంత్ రెడ్డి ఆరోపణలకు సమాధానంగా ఎన్నికల అఫిడవిట్లో అన్ని వివరాలు పేర్కొన్నారు.
కెసిఆర్ జీవితం తెరిచిన పుస్తకం..
రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల వేల కోట్ల అక్రమ ఆస్తుల వివరాలు మన్నె క్రిషాంక్ బయట పెట్టినా.. రేవంత్ రెడ్డి నుండి సమాధానం లేదు..
మన్నె క్రిషాంక్ పై కేసు పెడితే కోర్టు మొట్టికాయ వేసింది.
ప్రభుత్వానికి ఏ మాత్రం సిగ్గు,లజ్జ ఉన్న రేవంత్ రెడ్డి నైతికంగా రాజీనామా చేసి, పదవి నుండి తొలగాలి..
సిట్టింగ్ జడ్జి తో విచారణ చేపట్టాలని
కేటీఆర్ సవాలు విసిరితే.. రేవంత్ రెడ్డి కి విచారణ చేపట్టేందుకు ఎందుకు దైర్యం లేదు..
మొన్నటి వరకు కాళేశ్వరం పై అవినీతి ఆరోపణలు చేశారు.. ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా వచ్చింది..
మేడి గడ్డ లో కేవలం ఒక బ్లాక్ లో పియర్స్ మాత్రమే రిపేర్ కు ఉన్నాయి..
మూడేళ్ల నుండి ఆరోపణలు చేస్తూ..3 రూపాయల అవినీతి అయినా రుజువు చేశావా అని రేవంత్ రెడ్డి ని నిలదీశారు.
కరెంట్ ఎప్పుడూ వచ్చేది తెలుస్తలేదు.. ఎప్పుడూ పోయేది తెలుస్తలేదు..
24 గంటలు కాదు కనీసం రోజుకు12 గంటలు ఇచిన చాలు..
కన్నెపల్లి పంపు నుండి నీటిని ఎత్తిపో స్తే కేసీఆర్ కు ఎక్కడ పేరు వస్తాధో అని నీటిని ఎత్తిపోయడం లేదు..
దేవాదుల కేవలం విద్యుత్ సరఫరా చేయలేక కేవలం ఐదు మోటర్లు మాత్రమే నడిపిస్తు 6 లక్షల ఎకరాలకు నీరు అందని పరిస్థితి ఉన్నా ఇంకా సోయి లేకపోతే ఎలా అని నిలదీశారు.
భూగర్భ జలం ఇంకిపోయింది.విద్యుత్ సరఫరా లేదు..పంటలు ఎండిపోయే పరిస్థితి లో ఉన్నాయి..తక్షణమే నీటినీ విడుదల చేయాల్సిన అవశ్యకత ఉంది.
ఈ పంట చేతికి రావాలంటే నీరు విడుదల చేయాలి..
తక్షణమే కన్నెపల్లి నుండి నీటిని ఎత్తిపోయాలి.
రేవంత్ రెడ్డి తెలంగాణకు శని లాగ తయారు అయిండు..
కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యి అందించిన రేవంత్ రెడ్డి కి పాలన చేతకావడం లేదు.



ఎన్నికల ప్రణాళిక లో పేర్కొన్న హామీలు అమలు చేయాలి..
క్రాప్ హాలిడే ప్రకటించి ఎకరా 20 వేలు ఇవ్వాలి..
కేసీఆర్ కేటీఆర్ పై ఆరోపణలు చేసే ముందు.. నీ కింద గురిగుంజ నలుపు చూసుకో అని హితవు పలికారు.
అధికారం చేతి లో ఉందని కేసులు పెడుతున్నారు.
బీ ఆర్ ఎస్ నాయకుడు పై తాగిన మైఖంలో దాడి చేస్తే, పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు..
పోలీస్ స్టేషన్ కు 50 మీటర్ల దూరంలో జరిగిన దాడిని పోలీసులు పట్టించుకోవడంలేదు..
పోలీసులు శాంతి భద్రతలు కాపాడాలి..
అధికారం ఏ పార్టీకి శాశ్వతం కాదు..
కాంగ్రెస్ పార్టీ కి రోజులు దగ్గర పడ్డాయి..
దాడులతో బీఆర్ఎస్ ను అడ్డుకోలేరు..
పునరావృతం అయితే పరిస్థితుల తీవ్రంగా ఉంటాయి.. అని హెచ్చరించారు.
ప్రభుత్వ భూమి వివాదంలో నిర్మాణాన్ని తొలగించి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినా, అక్రమ దారుడు కి పోలీసులు అండగా ఉండి,అక్రమ కేసు పెట్టీ నిర్బంధించారు.
పోలీస్ల సంక్షేమం పై చిత్తశుద్ధి ఉంటే మూడేళ్లుగా పెండింగ్ లో ఉన్న పెట్రోల్ పంపు ఏర్పాటు చేయండి..
ఎమ్మెల్యే అభివృద్ధి కోసం పార్టీ మారిన అంటాడు.
ప్రభుత్వ ఆస్తులు కాపాడటం ఎమ్మెల్యే బాధ్యత కాదా..
ప్రభుత్వ ఆస్తులు నిర్వీర్యం అవుతుంటే అరికట్టడం నీ బాధ్యత కాదా..
పోలీసుల అండ కావాలి కానీ పోలీసుల సంక్షేమం మాత్రం పట్టించుకోవా..అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను నిలదీశారు..
ఎస్ ఆర్ ఎస్ పి నుండి తక్షణమే నీటిని విడుదల చేయాలి.. పొట్టదశలో ఉన్న వరి పంటను రక్షించేందుకు రెండు తడులు నీటిని విడుదల చేయాలి..కన్నెపల్లి నుండి నీటిని ఎత్తిపోయాలని, రెండో పంటకు నీరు అందించాలని డిమాండ్ చేశారు

# మున్సిపోల్స్ పై జగన్ సూపర్ స్పీడ్.. అందరికంటే ముందుగా అభ్యర్థుల ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి అన్న విషయం క్లారిటీ లేకపోయినా, ప్రతిపక్షం వైసీపీ దూకుడు చూపుతోంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము రెడీ అంటూ సంకేతాలు పంపుతోంది. ఇందులో భాగంగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలోని ఇతర పార్టీలకన్నా ముందుగా అభ్యర్థుల ఖరారుపై దృష్టిపెట్టిందని అంటున్నారు. నెల్లూరు కార్పొరేషన్ నుంచి మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్ కుమార్ రెడ్డిని ఎంపిక చేస్తున్నట్లు వైసీపీ ప్రకటించింది. పార్టీ అధినేత జగన్ రెడ్డి నేతృత్వంలో వైసీపీ నేతలు సమావేశమయ్యారు. ఇందులో అనేక విషయాలపై చర్చించిన పార్టీ నేతలు అధికార కూటమిని దీటుగా ఎదుర్కొనేలా అభ్యర్థులు ఎంపిక ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నెల్లూరు నుంచి విజయ్ కుమార్ రెడ్డిని రంగంలోకి దింపుతున్నట్లు మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు.



### అధినేత సమీక్షలు

రాష్ట్రంలో అక్టోబరు, నవంబరు నెలల్లో స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒకవైపు రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్న ప్రభుత్వం కోర్టు నిర్ణయం ఏవిధంగా ఉన్నా ఎన్నికల విషయంలో ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో ఈ నెలలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని మాజీ సీఎం జగన్మోహనరెడ్డి అంచనా వేస్తున్నారని అంటున్నారు. ఈ కారణంగా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఆయన తాడేపల్లిలో వరుసగా జిల్లాల నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్థానికంగానే అభ్యర్థుల ఎంపిక చేసుకోవాలని స్వేచ్ఛ ఇచ్చిన అధినేత కొన్ని కీలక స్థానాల విషయంలో తానే స్వయంగా నిర్ణయం తీసుకుంటున్నారని అంటున్నారు.

### తొలి అభ్యర్థి ఆనం

స్థానిక ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కుతున్న నేపథ్యంలో పార్టీలు అప్రమత్తమయ్యాయి. సరైన అభ్యర్థుల ఎంపికపై ఫోకస్ చేస్తున్నాయి. ఈ క్రమంలో వైసీపీ తొలి పేరు ప్రకటించింది. నెల్లూరు మేయర్ రేసులో ఆనం విజయ్ కుమార్ రెడ్డిని పోటీకి పెడుతున్నట్లు అధికారికంగా వెల్లడించింది. రిజర్వేషన్ ప్రక్రియపై స్పష్టత లేకపోయినా, అధికార పార్టీ నేతలు నెల్లూరు జనరల్ కేటగిరీలోకి వస్తుందన్న అంచనాతో అప్పుడే ప్రచారం చేసుకుంటున్నారని, తాము వెనకబడకూడదనే ఆలోచనతో మేయర్ అభ్యర్థిని ప్రకటిస్తున్నట్లు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో ఇతర పార్టీలు ఏవీ ఇంతవరకు అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం వెలువరించలేదు. కానీ, వైసీపీ మాత్రం అధికారికంగానే నిర్ణయం తీసుకోవడంతో మున్సిపోల్స్ కు ముందుగా దూసుకువచ్చినట్లు చెబుతున్నారు.

### కంగూరు పెడుతున్న కూటమి

స్థానిక ఎన్నికల విషయంలో కూటమి రాజకీయాలు విపక్షాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో ఆ పార్టీ ఎన్నికల విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని చెబుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కాకపోయినప్పటికీ నెల్లూరు మేయర్ అభ్యర్థిని వైసీపీ ప్రకటించడం చూస్తుంటే, ఎన్నికలను ఆ పార్టీ ఎంత సీరియస్ గా తీసుకుందో అర్థమవుతోందని అంటున్నారు. అధికార పార్టీ ఇంతవరకు ఎవరినీ అభ్యర్థిగా ప్రకటించకపోయినా, స్థానిక నేతలు అంతా ఓ నిర్ణయం తీసుకుని ఓ నాయకుడిని మేయర్ అభ్యర్థిగా ప్రచారం చేసుకోమని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అంటున్నారు. దీంతో ఆయన నెల్లూరులో అందరినీ కలుస్తూ, మద్దతు కూడగట్టుకుంటున్నారని చెబుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న వైసీపీ కూడా మేయర్ అభ్యర్థిని ముందుగా ప్రకటించాలని నిర్ణయం తీసుకుని వెనువెంటనే అమలు చేసినట్లుగా చెబుతున్నారు.

### ఆనం ఎందుకు?

నెల్లూరు మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్ కుమార్ రెడ్డి పేరు ప్రకటన రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నెల్లూరు నగరంలో ఆనం కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉండటంతో ఆ కుటుంబంలో ఒకరికి అవకాశం ఇవ్వాలని వైసీపీ నిర్ణయం తీసుకున్నట్లుగా చెబుతున్నారు. ఇదే సమయంలో కూటమిలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఇరుకన పెట్టేలా వ్యూహాత్మకంగా అడుగులు వేసిందని అంటున్నారు. నెల్లూరు కార్పొరేషన్ గా ఆవిర్భవించడానికి ముందు మున్సిపాలిటీగా ఉన్న సమయంలో ఆనం కుటుంబానికి చెందిన వివేకానందరెడ్డి సుదీర్ఘకాలం చైర్మనుగా పనిచేశారు. ఆ తర్వాత ఆయన ఎమ్మెల్యే అయ్యారు. ఈ కారణంగా నగరంలో ఆనం కుటుంబానికి ఉన్న ఆదరణను క్యాష్ చేసుకోవాలని వైసీపీ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుందని అంటున్నారు. ఇదే సమయంలో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందనే సంకేతాలు పంపడానికి ఆనం ఎంపిక నిదర్శనంగా చూపొచ్చునని అంటున్నారు.

# విజయసాయి గ్రౌండ్ వర్క్ సీరియస్ గానే ఉందే

**తిరుపతి, అక్టోబరు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు సిద్ధమవుతున్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మరో కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు ప్రజల ఎజెండాగా 15 అంశాలను ప్రకటించానని, ఈ నెల 8న తిరుపతిలో నిర్వహించనున్న తన నాలుగో ప్రెస్‌మీట్‌లో మరో ఐదు ప్రతిపాదనలను ప్రజల ముందుంచనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కలియుగ దైవమైన తిరుమలేశ్వరుడి సన్నిధిలోని తిరుపతిని ఈ సమావేశానికి వేదికగా ఎంచుకున్నట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. రాయలసీమ ఎదుర్కొంటున్న కరువు, ఎల్‌నినో ప్రభావం, ఉపాధి అవకాశాల కొరతతో జరుగుతున్న వలసలు వంటి అంశాలపై సమావేశంలో మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో రాష్ట్ర రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్న రెండు కుటుంబాలపై కూడా తన విమర్శలను కొనసాగించనున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. రాయలసీమ అభివృద్ధి, ప్రాంతీయ సమస్యలు, రాష్ట్ర రాజకీయాల్లో కుటుంబాల ప్రభావం వంటి అంశాలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు. గతంలోనూ రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టులు, ఉపాధి, యువతకు అవకాశాలపై ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. మన సంస్కృతి, భారతీయతపై జరుగుతున్న దాడుల అంశాన్ని కూడా తిరుపతి సమావేశంలో ప్రస్తావిస్తానని విజయసాయిరెడ్డి చెప్పారు. రాష్ట్రంలోనే ఒక వర్గం మైనార్టీగా మారిపోయే పరిస్థితి రాకుండా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, దీనికి సంబంధించి మరో ఐదు ప్రతిపాదనలను ప్రజల ముందు ఉంచుతానన్నారు. అయితే ఆ ఐదు ప్రతిపాదనలు ఏమిటన్నది ఆయన ఇంకా వెల్లడించలేదు. విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రక్రియను ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. విజయదశమి తర్వాత పార్టీని ప్రారంభించే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని గతంలో వెల్లడించారు. పార్టీ విధానాల్లో ప్రజల ఆదాయాన్ని పెంచడం, నిత్యావసరాల ధరలను తగ్గించడం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, విద్యుత్–విద్య–ఉద్యోగాలకు ప్రాధాన్యం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. యువతకు రాజకీయాల్లో పెద్దపీట వేస్తామని కూడా ప్రకటించారు. ఇప్పటివరకు విజయసాయిరెడ్డి విజయవాడ, అనంతపురం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో తన రాజకీయ కార్యాచరణకు సంబంధించిన అంశాలను వెల్లడించారు. రాయలసీమ తర్వాత ఉత్తరాంధ్రకు కూడా ప్రాంతీయ అభివృద్ధి, నీటి సమస్యలు, వలసలు, పరిశ్రమలు వంటి అంశాలపై ఆయన ప్రత్యేక ప్రతిపాదనలు వెల్లడించారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో జరగనున్న నాలుగో ప్రెస్‌మీట్‌లో విజయసాయిరెడ్డి ప్రకటించబోయే ఐదు కొత్త ప్రతిపాదనలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. సమాజం కోసం ఆలోచించే మీడియా ప్రతినిధులు సమావేశానికి హాజరై తన ప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.=



# టీడీపీ కార్యకర్తల కోసం పదవులు రిజర్వు.. 150 మందికి లోకేశ్ బంపర్ ఆఫర్

**తిరుపతి, అక్టోబరు 7, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీపై తనదైన ముద్రవేసేలా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కడప మహానాడులో కార్యకర్తే అధినేత అంటూ పిలుపునిచ్చిన లోకేశ్ ఇప్పుడు ఆ నినాదాన్ని నిజం చేసేలా అడుగులు వేస్తున్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న పార్టీ కోసం పనిచేసిన నాయకులను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా, వారి కోసం నామినేటెడ్ పదవులను రిజర్వు చేయాలని నిర్ణయించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి ఆయన అనుమతి కూడా తీసుకున్నారని అంటున్నారు. దీంతో టీడీపీలో క్షేత్రస్థాయిలో పనిచేసిన సుమారు 150 మందికి త్వరలో నామినేటెడ్ పోస్టులు దక్కనున్నాయని అంటున్నారు. తెలుగుదేశం పార్టీలో తన ఆరంగేట్రం నుంచి నారా లోకేశ్ తనదైన ముద్ర కోసం ప్రయత్నిస్తున్నారు. తొలిసారిగా కార్యకర్తల సంక్షేమ నిధికి రూపకల్పన చేసి కార్యకర్తల మనసులను గెలుచుకున్నారు. ఆపద సమయంలో అపన్నహస్తం అందించేలా టీడీపీ సభ్యత్వం ఉన్నవారికి బీమా చేయించారు. ఆ తర్వాత కార్యకర్తల కోసం తాను ఉన్నానంటూ పలు కార్యక్రమాలను లోకేశ్ తీసుకువచ్చారు. ప్రధానంగా సోషల్ మీడియా ద్వారా కార్యకర్తలకు అందుబాటులో ఉండటమే కాకుండా, టీడీపీ కోసం పనిచేసి ప్రాణాలు కోల్పోయిన తోట చంద్రయ్య వంటివారి కుటుంబ సభ్యులకు వెన్నుదన్నుగా నిలిచారని చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు నామినేటెడ్ పోస్టుల్లోనూ కార్యకర్తలకు అగ్ర తాంబూళం దక్కాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.



ఇక మంత్రి లోకేశ్ తీసుకున్న నిర్ణయంతో టీడీపీలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న 150 మందికి త్వరలో పదవులు దక్కే అవకాశం ఉందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 సెప్టెంబరులో తొలివిడతలో 20 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారు. వీరి పదవీ కాలం ఈ నెలతో ముగియనుందని అంటున్నారు. పార్టీలో అందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలనే ఆలోచనతో ప్రస్తుతం పదవుల్లో ఉన్న చాలా మందికి రెన్యువల్ చేసే అవకాశం లేదని అంటున్నారు. వీరిస్థానంలో గత ప్రభుత్వంపై ధైర్యసాహసాలతో పోరాడి తెగువ చూపిన కార్యకర్తలకు పెద్దపీట వేయాలని వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. 2024లో రెండు విడతలు సుమారు 148 పదవులను భర్తీ చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పదవులు అన్నింటిని ఇప్పుడు కొత్తవారికి ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. అయితే సహజంగా పదవుల కోసం ఏ పార్టీలో అయినా పైరవీలు ఉంటాయి. ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సుతోనే పదవులు కట్టబెట్టే సంస్కృతి ఇప్పటివరకు ఉందని పరిశీలకులు చెబుతున్నారు. టీడీపీ కూడా ఇప్పటివరకు ఇదే విధానాన్ని అవలంబించిందని అంటున్నారు. అయితే నారా లోకేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక ఈ విధానాన్ని సంస్కరించాలని నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. సిఫార్సులు లేకుండా వచ్చే నెలతో ఖాళీ అయ్యే పదవులు అన్నింటిని భర్తీ చేస్తామని మంత్రి లోకేశ్ బహిరంగంగా ప్రకటించారు. పనితీరే ఆధారంగా కార్యకర్తల ఎంపిక ఉంటుందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన కార్యకర్తలను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెబుతున్నారు. గతంలో చేపట్టిన 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంతోపాటు పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేసిన వారు, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సుపరిపాలనకు తొలి అడుగు, రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాల్లో బాగా పనిచేసిన వారిని గుర్తించనున్నట్లు చెబుతున్నారు. మొత్తం ఆరు అంశాలను పరిశీలించి కనీసం ఐదింటిలో మెరుగైన ఫలితాలు సాధించేలా పనిచేసిన వారికి పదవులు కట్టబెట్టాలని నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. దీంతో మంత్రి లోకేశ్ నిర్ణయం పార్టీ వర్గాల్లో విస్తృత చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు.

# ఉత్తరాంధ్రలో వైసీపీ గ్రాఫ్ ఏమౌతోంది

**విశాఖపట్టణం, అక్టోబరు 7, పెన్ పవర్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత బలమైన కోటగా నిలిచిన ఉత్తరాంధ్ర లో ప్రస్తుతం ఆ పార్టీ పరిస్థితి ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. 2024 ఎన్నికల ఓటమి తర్వాత కుదురుకుంటుందని భావించినప్పటికీ, కీలక నేతల వరుస రాజీనామాలు, సస్పెన్షన్లతో పార్టీ గ్రాఫ్ పడిపోయింది. విజయనగరం జిల్లాలో పార్టీకి వెన్నెముకగా ఉన్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్సీపీకి రాజీనామా చేయడంతో బొత్స సత్యనారాయణ ప్రాబల్యంపైనే పెద్ద ప్రశ్నమార్క్ పడింది. దానికి తోడు బద్దుకొండ అప్పలనాయుడు సస్పెన్షన్, సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే దువ్వాడ శ్రీను పార్టీకి దూరం కావడంలాంటి కారణాలతో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పార్టీ కొంత చేటు తెచ్చింది. ఇక .విశాఖపట్నం రాజకీయాలను పరిశీలిస్తే, ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ సహా పలువురు కీలక నేతలు వైఎస్సార్సీపీకి వీడ్కోలు పలికారు. మిగిలిన కొద్దిమంది సీనియర్ నాయకులు సైతం వైఎస్సార్సీపీ కార్యకలాపాలకు దూరంగా ఉండిపోయారు. పార్టీ వీడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటమే కాకుండా, నూతనంగా పార్టీలో చేరేందుకు ఏ ఒక్క ద్వితీయ శ్రేణి నాయకుడు కూడా ఉత్సాహం చూపడంలేదు. అధిష్టానం ఎంత ఒత్తిడి తెచ్చినా క్షేత్రస్థాయిలో కేడర్ను సమాయత్తం చేసే నాయకులు కరువయ్యారు. శ్రీకాకుళం నుంచి విజయనగరం వరకు పార్టీని నడిపించాల్సిన సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ప్రభావం కూడా ఇప్పుడు నామమాత్రంగానే మారిపోయింది. తన స్వంత మేనల్లుడైన మజ్జి శ్రీనివాసరావును కూడా పార్టీలో నిలుపుకోలేకపోయారనే విమర్శలు వైఎస్సార్సీపీ వర్గాల నుంచే వస్తున్నాయి. రీజినల్ కోఆర్డినేటర్లు, ఇన్చార్జులు వచ్చి సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ, అవి కేవలం ప్రెస్ మీట్లకే పరిమితమవుతున్నాయి.

ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత ప్రజల్లో ఉన్న ఆ వ్యతిరేకతను అధిగమించేందుకు వైఎస్సార్సీపీ రీ-బిల్డింగ్ ప్లాన్స్ ఏవీ ఉత్తరాంధ్రలో పనిచేయడం లేదు. ఓటమి నిరాశ నుంచి బయటపడకముందే వరుస వికెట్లు పడిపోతుండటంతో పార్టీ క్యాడర్ అయోమయంలో వుంది. సరైన నాయకత్వం, స్పష్టమైన వ్యూహం, క్షేత్రస్థాయి పోరాటాలు లేకపోతే.. ఒకప్పుడు తన సొంత కోటగా భావించిన ఉత్తరాంధ్రలోనే వైఎస్సార్సీపీ ఉనికి ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

# అసెంబ్లీ ఫార్ములా రగడ...

**ఒంగోలు అక్టోబరు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ఇప్పుడు మరో కీలక రాజకీయ పరీక్షను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి సాధించిన విజయాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలన్న లక్ష్యంతో కూటమి నాయకత్వం వ్యూహరచనకు పదును పెడుతోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మధ్య జరిగిన సుదీర్ఘ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. అమరావతిలో దాదాపు రెండు గంటల పాటు జరిగిన భేటీలో స్థానిక ఎన్నికల్లో కూటమి ఎదుర్కొనే ప్రధాన సవాళ్లపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఈ సమావేశం కేవలం సీట్ల పంపకాలపై చర్చకే పరిమితం కాలేదన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు టీడీపీ--జనసేన మధ్య సమన్వయం ఎలా ఉండాలి? ఏ పార్టీకి ఏ ప్రాంతంలో బలం ఉంది? మిత్రపక్షాల మధ్య పోటీ కారణంగా ఓట్లు చీలకుండా ఎలా చూడాలి? అనే అంశాలే అసలు ఎజెండాగా కనిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి ప్రధాన కారణాల్లో టీడీపీ, జనసేన మధ్య సమన్వయం ఒకటి. ఇప్పుడు అదే ఫార్ములాను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అమలు చేయాలని నాయకత్వం భావిస్తోంది. అయితే స్థానిక ఎన్నికల స్వభావం అసెంబ్లీ ఎన్నికల కంటే భిన్నం. ఇక్కడ అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, స్థానిక వర్గ సమీకరణాలు, కుటుంబ రాజకీయాలు, గ్రామస్థాయి సంబంధాలు, స్థానిక నాయకుల మధ్య పోటీ వంటి అంశాలు కీలకంగా మారతాయి. అందుకే రాష్ట్రస్థాయిలో కుదిరే అవగాహనను క్షేత్రస్థాయిలో అమలు చేయడం కూటమి నాయకత్వానికి అసలు సవాలుగా మారనుంది. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన మధ్య ప్రత్యేక సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం కీలకంగా మారింది. ఏ ప్రాంతంలో ఏ పార్టీకి బలమైన కేడర్, సామాజిక ఆధారం, స్థానిక నాయకత్వం ఉందో అంచనా వేసి, అక్కడ ఆ పార్టీకి ప్రాధాన్యం ఇచ్చే విధానం తెరపైకి వస్తోంది. ఇది కేవలం సీట్ల సర్దుబాటు కాకుండా.. కూటమి ఓటు బ్యాంకును సమర్థంగా వినియోగించుకునే ప్రయత్నంగా చూడొచ్చు. ఒకే ప్రాంతంలో మిత్రపక్షాలు పరస్పరం పోటీ పడితే అధికార వ్యతిరేక ఓటుతో పాటు కూటమి ఓటు కూడా చీలిపోయే అవకాశం ఉంటుంది. ఈ ప్రమాదాన్ని ముందుగానే అడ్డుకోవడమే సమన్వయ కమిటీ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. పవన్ కళ్యాణ్‌తో సమావేశం అనంతరం చంద్రబాబు టీడీపీ ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ కావడం కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక ఎన్నికల విషయంలో పార్టీ అంతర్గతంగా ఎలాంటి అసంతృప్తి తలెత్తకుండా చూడాలని చంద్రబాబు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, ఆశావహులు అసంతృప్తికి గురైతే దాని ప్రభావం నేరుగా క్షేత్రస్థాయిలో పడే అవకాశం ఉంది. అందుకే వ్యక్తిగత ప్రయోజనాల కంటే కూటమి ప్రయోజనాలే ముఖ్యమని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు కూటమికి కేవలం మరో ఎన్నిక కాదు. అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ--జనసేన భాగస్వామ్యం క్షేత్రస్థాయిలో ఎంతవరకు బలపడిందో తేల్చే పరీక్ష కూడా. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కనిపించిన ఐక్యతను గ్రామస్థాయి రాజకీయాల్లో కొనసాగించగలిగితే కూటమి మరింత బలపడే అవకాశం ఉంటుంది. అయితే స్థానిక ఎన్నికల్లో వ్యక్తిగత ఆశలు, స్థానిక ఆధిపత్య పోటీలు, టికెట్ల కోసం పోటీ పెరగడం సహజం. ఈ విభేదాలను ఎంత సమర్థంగా పరిష్కరిస్తారన్నదే కూటమి విజయానికి కీలకంగా మారనుంది. మొత్తంగా చంద్రబాబు--పవన్ భేటీని చూస్తే.. స్థానిక ఎన్నికల్లో ఎవరు ఎన్ని స్థానాలు గెలుస్తారనే దానికంటే ముందుగా కూటమి భాగస్వామ్య పక్షాలు ఒకరినొకరు ఎంతవరకు సమన్వయం చేసుకుంటాయన్నదే అసలు రాజకీయ కథగా మారుతోంది. గ్రామస్థాయిలో ఈ సమన్వయం సక్సెస్ అయితే స్థానిక ఎన్నికల ఫలితాలు కూటమికి మరో పెద్ద రాజకీయ బలంగా మారే అవకాశం ఉంది.

# గాడిన పడుతున్న ఆర్థిక వ్యవస్థ

**విజయవాడ, అక్టోబరు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుడ్ న్యూస్. ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్న ఆ రాష్ట్రం ఇప్పుడు గాడిలో పడుతుంది. చంద్రబాబు దార్శనీయకమైన పరిపాలన ఆ రాష్ట్రానికి ఆయువు పట్టు లాగా మారింది. ఆయన నాయకత్వంలో ఏపీ రాష్ట్రం అనేక రంగాలలో అభివృద్ధి సాధిస్తోంది. ఇప్పుడు ఏకంగా జాతీయ సగటును మించిపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖజానాకు జీఎస్టీ వసూళ్లు ఊరట కలిగించే విధంగా ఉన్నాయి. రాష్ట్రంలో పన్ను ఆదాయం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక కార్యకలాపాలలో కదలిక కొనసాగుతోంది. ముఖ్యంగా 2026 సెప్టెంబర్ లో ఏపీ నెట్ జీఎస్టీ వసూళ్లు జాతీయ వృద్ధి సగటును మించిపోయాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేస్తోంది. 2026 సెప్టెంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ నెట్ జీఎస్టీ వసూళ్లు 3,182.87 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది వసూళ్లు సెప్టెంబర్ నెలలో 2,789.50 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే వసూళ్ల వృద్ధి 14.1 సున్న శాతంగా నమోదయింది. ఇక ఇదే సమయంలో జాతీయస్థాయిలో పోస్ట్ సెటిల్మెంట్ నెట్ జీఎస్టీ వృద్ధి రేటు సాగటు 8 శాతం గా ఉంది. అంటే జాతీయ సగటుతో పోల్చి చూస్తే ఏ అభివృద్ధి గణనీయంగా నమోదయింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు పరిశీలిస్తే రాష్ట్ర నెట్ జీఎస్టీ వసూళ్లు 19,635.49 కోట్లకు చేరుకున్నాయి. గత ఎడాది ఇదే కాలంలో 16,760.21 కోట్లుగా వసూళ్ళు ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే ఏకంగా 18% వృద్ధి నమోదయింది. మొత్తం కమర్షియల్ ట్యాక్స్ వసూళ్లు కూడా సెప్టెంబర్ నాటికి 30,435.98 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 25,892.92 కోట్లుగా ఉన్నది. గత ఏడాదితో పోల్చి చూస్తే వృద్ధిరేటు ఏకంగా 18% అధికంగా నమోదయింది. ఈ పెరుగుదలకు పన్ను చెల్లింపుల్లో మెరుగైన అనుసరణ.. కట్టుదిట్టమైన తనిఖీ.. రెవెన్యూ మానిటరింగ్.. ఆర్థిక కార్యకలాపాల విస్తరణ వంటివి కారణాలని అధికారులు చెబుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డేటా అనలటిక్స్.. యూపీఐ లావాదేవీల విశ్లేషణ.. ఐ జీఎస్టీ రివర్సల్స్ డిస్కం ఆదారిత రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్ వంటి చర్యలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయడంతో ఆదాయం పెరిగిపోయింది. ప్రభుత్వ చర్యలు మాత్రమే కాకుండా.. వినియోగం.. వ్యాపార కార్యకలాపాలు.. పన్ను అనుసరణ వంటి అనేక అంశాలు కూడా జీఎస్టీ వసూళ్లకు దోహదం చేశాయని వాణిజ్య శాఖ అధికారులు చెబుతున్నారు. జాతీయస్థాయిలో సెప్టెంబర్ 2026 లో మొత్తం స్థూల జీఎస్టీ వసూళ్లు కూడా 14.7% పెరిగాయి. మొత్తంగా 2.3 లక్షల కోట్లకు చేరుకున్నాయి. మొత్తంగా చూస్తే జీఎస్టీ వసూళ్లలో ఏపీ నమోదు చేస్తున్న అభివృద్ధి రాష్ట్ర ప్రజలకు కొంత ఆర్థిక వెసులుబాటు కల్పించే పరిణామం లాగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఇదే ధోరణి కొనసాగితే ఏపీ రాష్ట్రం ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధిస్తుంది. సమర్థవంతమైన నాయకత్వం.. ఆర్థిక అంశాలలో పొదుపు వల్ల ఈ స్థాయిలో వసూళ్లు సాధ్యమయ్యాయి. కాగా, ఏపీ ఖజానా ఇలా కావడం.. జగన్ కు మింగుడుపడని వార్త అని టీడీపీ నాయకులు అంటున్నారు.

## 2027 వరల్డ్‌కప్ తర్వాత కోహ్లి రిటైర్ అవ్వడా? ఇంగ్లండ్ మాజీ స్టార్ సంచలన కామెంట్స్

- 2027 వన్డే వరల్డ్‌కప్ తనకు చివరిదని ఇప్పటికే ప్రకటించిన కోహ్లి
- అయితే ఆ టోర్నీ తర్వాత కూడా కోహ్లి క్రికెట్‌కు వీడ్కోలు చెప్పకపోవచ్చన్న పనేసర్
- విరాట్‌లో ఇప్పటికీ పరుగులు చేయాలనే ఆకలి చాలా ఉందని వ్యాఖ్య
- అందుకే వరల్డ్‌కప్ తర్వాత అతడు రిటైర్ అవుతాడని తనకు అనిపించడం లేదన్న పనేసర్
- రోహిత్ క్రీజులో కుదురుకుంటే విధ్వంసకరంగా బ్యాటింగ్ చేయగలడని ప్రశంస



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిపై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే వరల్డ్‌కప్ తనకు చివరిదని కోహ్లి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ టోర్నీ తర్వాత కూడా కోహ్లి క్రికెట్‌కు వీడ్కోలు చెప్పకపోవచ్చని పనేసర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల వన్డేల్లో కోహ్లి 15 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఈ సందర్భంగా కోహ్లి ఆటపై పనేసర్ ప్రశంసలు కురిపించాడు. అతడిలో ఆటపై ఆకలి, దూకుడు, ఫిట్‌నెస్‌పై శ్రద్ధ తనను ఆకట్టుకుంటున్నాయని చెప్పాడు. కోహ్లి శిక్షణ చూస్తే తాను కూడా జిమ్‌కు వెళ్లాలనిపిస్తుందని పేర్కొన్నాడు. "విరాట్‌లో ఇప్పటికీ పరుగులు చేయాలనే ఆకలి చాలా ఉంది. ప్రతి మ్యాచ్‌ను ఎంతో తీవ్రతతో ఆడతాడు. ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తాడు. చుట్టూ ఉన్న వారిని కూడా ప్రోత్సహిస్తాడు. 10-15 మ్యాచ్‌లే మిగిలి ఉన్నాయని భావిస్తే ప్రతి మ్యాచ్‌ను ప్రత్యేకంగా చూస్తాం. కోహ్లి కూడా ప్రస్తుతం అదే మైండ్‌సెట్‌తో ఆడుతున్నాడు. ప్రతి బంతికి తన వంద శాతం ఇస్తున్నాడు. అందుకే వరల్డ్‌కప్ తర్వాత అతడు రిటైర్ అవుతాడని నాకు అనిపించడం లేదు. అతడి నుంచి ఇంకా చాలా క్రికెట్ చూడొచ్చు" అని పనేసర్ చెప్పాడు.

మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మపైనా పనేసర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ గొప్ప ఆటగాడని, అతడికి ప్రపంచకప్ జట్టులో అవకాశం ఇవ్వాలని అన్నాడు. రోహిత్ క్రీజులో కుదురుకుంటే విధ్వంసకరంగా బ్యాటింగ్ చేయగలడని పేర్కొన్నాడు. "రోహిత్ అద్భుతమైన ఆటగాడు. అతడు ఫామ్‌లోకి వస్తే బ్యాటింగ్‌తో ప్రత్యర్థులను చిత్తు చేయగలడు. భారత్‌కు అతడి లాంటి నాణ్యమైన ఆటగాడు అవసరం" అని పనేసర్ చెప్పాడు.

## ఐసీసీ ర్యాంకింగ్స్: శ్రేయస్‌కు కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంక్.. టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు

- వెస్టిండీస్‌పై సెంచరీతో టీ20 ర్యాంకింగ్స్‌లో 7వ స్థానానికి శ్రేయస్
- టీ20 టాప్-10లో ఇషాన్, అభిషేక్, శ్రేయస్, తిలక్ వర్మ
- డబుల్ సెంచరీతో వన్డేల్లో అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్న శుభ్‌మన్ గిల్
- వన్డే బ్యాటింగ్ టాప్-10లోకి తిరిగి ప్రవేశించిన కేఎల్ రాహుల్



ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకోగా, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో అద్భుత శతకం సాధించిన శ్రేయస్ అయ్యర్, టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 7వ స్థానంలో నిలిచాడు.

నిన్న జరిగిన ఆ మ్యాచ్‌లో శ్రేయస్ కేవలం 43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేసి జట్టుకు 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించాడు. ఈ ప్రదర్శనతో అతను టీ20ల్లో భారత్ తరఫున మూడో అత్యుత్తమ ర్యాంకు బ్యాటర్‌గా నిలిచాడు. తాజా ర్యాంకింగ్స్‌లో ఇషాన్ కిషన్ (1), అభిషేక్ శర్మ (2) తొలి రెండు స్థానాల్లో ఉండగా.. తిలక్ వర్మ 10వ స్థానంలో ఉన్నాడు. దీంతో టీ20 బ్యాటింగ్ టాప్-10లో నలుగురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం.

**అగ్రస్థానంలో గిల్ పదిలం**

మరోవైపు వన్డే ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో గువాహటిలో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసిన గిల్, తన కెరీర్‌లోనే అత్యధికంగా 841 రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు. విజయవంతమైన వన్డే ఛేదనలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం గమనార్హం. ఇదే జాబితాలో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి ఒక స్థానం దిగజారి మూడో ర్యాంకుకు పడిపోయాడు. అదే సిరీస్‌లో అజేయ శతకం (129) బాదిన వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తిరిగి టాప్-10లోకి ప్రవేశించాడు.

**మళ్లీ నం.01 స్థానానికి రషీద్ ఖాన్**

బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్థాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌ను వెనక్కి నెట్టి రషీద్ 8వ సారి నంబర్ 1 ర్యాంకును అందుకున్నాడు. టీ20 చరిత్రలో మరే బౌలర్ కన్నా ఎక్కువ కాలం నం.01గా నిలిచిన బౌలర్‌గా రషీద్ రికార్డు సృష్టించాడు. భారత స్పిన్ ఆల్-రౌండర్ అక్షర్ పటేల్ గత మూడు మ్యాచ్‌ల్లో నిలకడగా రాణించి 16 స్థానాలు మెరుగుపరచుకుని 7వ ర్యాంకుకు చేరుకున్నాడు.

ఇతర ఆటగాళ్లలో వెస్టిండీస్ వన్డే కెప్టెన్ షాయ్ హోప్ (6వ ర్యాంక్), విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్ (10వ ర్యాంక్) వన్డేల్లో టాప్-10లోకి వచ్చారు. వెస్టిండీస్‌కే చెందిన అమీర్ జంగూ 55 స్థానాలు ఎగబాకి 55వ ర్యాంకు సాధించాడు. ఆసియా క్రీడల్లో రాణించిన పాకిస్థాన్ ఆటగాడు హసన్ నవాజ్ 62 స్థానాలు మెరుగుపరుచుకుని 48వ ర్యాంకులో నిలిచాడు.

## 2036 ఒలింపిక్స్‌పై భారత్ మాస్టర్ ప్లాన్.. అహ్మదాబాద్ నుంచి బిడ్ ప్రక్రియ షురూ!

2036 సంవత్సరంలో జరిగే ఒలింపిక్స్, పారాలింపిక్స్ క్రీడల ఆతిథ్య వేదికను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా.. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఠాజ) ప్రకటించిన నగరాలు, దేశాల జాబితాను ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఠూూ) సాదరంగా స్వాగతించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ (ూఎఝఝు) కేంద్రంగా భారత్ తన ఒలింపిక్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తోంది. గత 18 నెలలుగా ఐఓసీతో జరిపిన నిరంతర సంప్రదింపుల ద్వారా ఈ ప్రణాళిక రూపుదిద్దుకుంది.

**రైజింగ్ టు గెదర్ నినాదంతో ముందుకు..**

భారతదేశం ఎంచుకున్న రైజింగ్ టుగెదర్ దృక్పథం.. క్రీడల ద్వారా దేశం రూపాంతరం చెందడం, ఒలింపిక్ ఉద్యమ భవిష్యత్తు కలిసికట్టుగా కొనసాగాలనే నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడం కేవలం ఒక గ్లోబల్ ఈవెంట్‌ను నిర్వహించడమే కాకుండా, క్రీడలను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడానికి ఒక చారిత్రక అవకాశం. కోట్లాది మంది యువతను కేవలం క్రీడలను వీక్షించే స్థాయి నుంచి వాటిని ఆచరించే స్థాయికి తీసుకెళ్లడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం.

**ఒలింపిక్ ఉద్యమానికి నూతన శకం**

ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా, అత్యుత్తమ డిజిటల్ నెట్‌వర్క్ కలిగిన భారత్‌కు ఒలింపిక్స్ ఆతిథ్యం దక్కితే అది ఒలింపిక్ ఉద్యమానికి ఒక కొత్త శకం అవుతుందని ఐఓసీ భావిస్తోంది. వంద కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలోకి ఒలింపిక్స్ ప్రవేశించడం వల్ల కొత్త అథ్లెట్లు, కొత్త ప్రేక్షకులు, కొత్త భాగస్వాములు ఒలింపిక్ కుటుంబానికి లభిస్తారు. భారతదేశం యొక్క సాంస్కృతిక వైవిధ్యాన్ని ఈ వేడుక ప్రపంచానికి చాటిచెప్పనుంది.

**పీటీ ఉష, మన్సుఖ్ మాండవ్య హర్షం:**

ఐఓఏ అధ్యక్షుడు పీటీ ఉష మాట్లాడుతూ.. 2036 ఒలింపిక్స్ కోసం భారత్ కంటున్న కలలను ఐఓసీ గుర్తించడం మాకు అత్యంత గర్వకారణం. రైజింగ్ టు గెదర్ అనేది కేవలం నినాదం కాదు, అంకితభావంతో కూడిన శక్తి.. అక్టోబర్ చివరి వరకు ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు మా ఆశయాలను ప్రదర్శించడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని తెలిపారు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవ్య మాట్లాడుతూ.. క్రీడలు మన దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగలవు.. ఒలింపిక్స్ నిర్వహణ ద్వారా మిలియన్ల మంది యువతను క్రీడల వైపు ప్రోత్సహించవచ్చు.. దేశంలో ప్రతి సామాజిక వర్గానికి క్రీడా పరివర్తనను తీసుకురావడానికి ఇది దోహదపడుతుందని అన్నారు. త్వరలోనే ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ఎదుట భారత్ తన అధికారిక ప్రణాళికను ప్రదర్శించనుంది.

## ఆ విషయంలో జక్కన్న కంటే సుకుమార్ ఉత్తమంగా!

తెలుగు చలనచిత్ర పరిశ్రమను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడిగా రాజమౌళి స్థానం తిరుగులేనిది. తన ఊహాశక్తితో, విజువల్ వండర్స్‌తో -ఆర్‌ఆర్‌ఆర్- మూవీతో ఆస్కార్ వేదిక వరకు బాహుబలిలా జెండా పాతారు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడిగా రాజమౌళి స్థానం తిరుగులేనిది. తన ఊహాశక్తితో, విజువల్ వండర్స్‌తో -ఆర్‌ఆర్‌ఆర్- మూవీతో ఆస్కార్ వేదిక వరకు బాహుబలిలా జెండా పాతారు. అయితే దర్శకుడిగా వంద శాతం సక్సెస్ రేట్ ఉన్న రాజమౌళి సమర్పకుడిగా , ప్రొడ్యూసర్‌గా వస్తున్న సినిమాల విషయంలో మాత్రం అనుకున్న స్థాయిలో మ్యాజిక్ రిపీట్ చేయలేకపోతున్నారనే చర్చ సినీ వర్గాల్లో గట్టిగా నడుస్తోంది. తాజాగా ఆయన సమర్పణలో ఫహద్ ఫాసిల్ కథానాయకుడిగా రూపొందిన -డోంట్ ట్రబుల్ ది ట్రబుల్- సైతం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. గతాన్ని పరిశీలిస్తే రాజమౌళి సమర్పణ తోడైన చిత్రాల్లో -విశాఖ ఎక్స్‌ప్రెస్-, -రాజన్న-, -అందాల రాక్షసి-, -బ్రహ్మాస్త్ర- (తెలుగు వెర్షన్) వంటి సినిమాలున్నా? ఇవేవీ బాక్సాఫీస్ వద్ద పెద్ద సంచలనాలు నమోదు చేయలేకపోయాయి. రాజమౌళి బ్రాండ్ ఇమేజ్ వల్ల ప్రారంభ వసూళ్లు లభించినా? కంటెంట్ పరంగా ప్రేక్షకులను పూర్తిస్థాయిలో మెప్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఇదే కోవలో సొంత బ్యానర్ -సుకుమార్ రైటింగ్స్- ద్వారా సినిమాలను నిర్మిస్తున్న మరో దిగ్గజ దర్శకుడు







సుకుమార్ మాత్రం పూర్తి భిన్నమైన వ్యూహంతో దూసుకుపోతున్నారు. సుకుమార్ నిర్మాతగానే కాకుండా శిష్యులకు, యువ దర్శకులకు అవకాశాలు ఇస్తూ కథ, స్క్రీన్ ప్లే అందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. -కుమారి 21ఎఫ్- మొదలైన విజయయాత్ర -ఉప్పెన-, -విరూపాక్ష- వంటి భారీ బ్లాక్‌బస్టర్ల వరకు నిరాటంకంగా కొనసాగింది. స్క్రిప్ట్ ఎంపిక చేయడం, కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడంలో సుకుమార్ తీసుకునే జాగ్రత్తలే ఆయన బ్యానర్‌ను సక్సెస్ రూట్‌లో ఉంచాయన్నది కాదనలేని నిజం. దర్శకుడిగా రాజమౌళి శిఖరాగ్రాన ఉన్నా? సమర్పకుడిగా.. నిర్మాతగా కంటెంట్ ఎంపిక, సక్సెస్ రేట్ విషయంలో మాత్రం జక్కన్న కంటే సుకుమారే మెరుగైన స్థానంలో ఉన్నార నడంలో సందేహం లేదు. ప్రత్యేకించి సుకుమార్ శిష్యులు గొప్ప దర్శకులుగా ఎదుగుతున్నారు. అతడి కాంపౌండ్ నుంచి వచ్చిన వారంతో సోంతంగా సినిమాలు చేస్తున్నారు. వాటికి సుకుమార్ ఏదో రూపంలో సహకారం అంది స్తున్నారు. కానీ ఇంత వరకూ రాజమౌళి స్కూల్ నుంచి బయటకు వచ్చి సక్సెస్ అయిన దర్శకులు లేరు. జక్కన్న వద్ద చాలా మంది పనిచేసారు. కానీ వాళ్లెవ్వరు సక్సెస్ అవ్వలేదు. తన అసిస్టెంట్..అసోసియేట్ దర్శకుల గురించి రాజమౌళి ఫోకస్డ్ గా చెప్పింది కూడా పెద్దగా లేదు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com